RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 184 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శనివారం 4-7-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠ మాసం, తిథి॥చవితి ఉ॥9.45, ధనిష్ఠ ఉ॥11.45, వర్జ్యం రా॥7.12 - 8.51, దుర్ముహూర్తం ఉ॥5.32-7.17, శుభ సమయం ఉ॥6.00-7.30, రాహుకాలం ఉ॥9.00-10.30, సూర్యోదయం ఉ॥ 5.31, సూర్యాస్తమయం సా॥ 6.34 గం॥

## సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు

### స్టేషన్‌లో రక్తపు మరకలు, లాఠీ గుర్తింపు

**విజయవాడ, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోన్న గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజు కస్టడీ కోరుతూ దాఖలు చేసిన మెమోలో కోర్టుకు సిట్ ముఖ్య విషయాలు తెలియజేసింది. కేసులో కీలకమైన సీసీటీవీ ఫుటేజ్ స్టేషన్‌లో లేదని.. అవి ధ్వంసమయ్యే అవకాశం ఉన్నట్టు ఫోరెన్సిక్ ల్యాబ్ గుర్తించిందని సిట్ వెల్లడించింది. స్టేషన్‌లో అనుమానాస్పద మరకలు గుర్తించినట్లు తెలిపింది. అనుమానాస్పద మరకలు ఉన్న లాఠీ, ఎముకలు, కాలిపోయిన బూడిద, పాక్షికంగా కాలిన ఇనుప హ్యాండ్ గొలుసును స్టేషన్ టెర్రస్ నుంచి సీజ్ చేసినట్లు పేర్కొంది. సాయికృష్ణ కస్టడీలో తీవ్ర గాయాలతో మృతి చెందాడని కొందరి స్టేట్‌మెంట్ల ఆధారంగా గుర్తించామని సిట్ తెలిపింది. మృతదేహాన్ని ఏం చేశారనే విషయాన్ని కస్టడీకి అనుమతిస్తే సీఐ నాగరాజును తీసుకువెళ్లి గుర్తిస్తామని మెమోలో సిట్ పేర్కొంది.

## అమర్‌నాథ్ యాత్రికులకు మోదీ శుభాకాంక్షలు

- యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి
- యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు



**న్యూఢిల్లీ,జూలై 3(ఆర్ఎన్ఎ):** అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు. 'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగాన్ని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది.

మిగతా 2లో..



## రాయలసీమ ప్రాంతాన్ని 'ఉక్కుసీమ'గా మారుస్తా

- స్టీల్ స్టేట్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం
- సున్నపురళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మాణం
- సీమలో పారాల్సింది రక్తం కాదు..నీళ్లు
- మావిగన్, విజయవాడ..రేపు మరేంటో
- జగన్ తీరుపై పరోక్షంగా విమర్శలు
- సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

**అమరావతి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త పారిశ్రామిక హబ్‌గా, ముఖ్యంగా 'స్టీల్ స్టేట్'గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కడప జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురళ్ల పల్లెలో రూ. 16,350 కోట్లతో నిర్మించనున్న ప్రతిష్టాత్మక జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఆ తర్వాత విజయనగరం జిల్లాలోని జిందాల్ పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు .రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలోనే మొదటిసారిగా గ్రీన్ స్టీల్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. కేవలం విశాఖపట్నం మాత్రమే కాకుండా, రాయలసీమ ప్రాంతాన్ని కూడా 'ఉక్కుసీమ'గా

మిగతా 2లో..

## భావ ప్రకటన స్వేఛ్ఛ అంటే బూతుల ప్రచారమా?

సోషల్ మీడియాలో పవన్‌పై విమర్శలు తగవు

మండిపడ్డ మంత్రి కందుల దుర్గేశ్



**విజయవాడ, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా స్పందించారు. భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదని హెచ్చరించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు సోషల్ మీడియాలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే కూటమి

మిగతా 2లో..

## ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు

- శృంగవరపుకోటలో వర్చువల్‌గా ప్రారంభించిన చంద్రబాబు
- రాష్ట్ర అభివృద్ధికి కీలకం అన్న హోంమంత్రి అనిత



**విజయనగరం, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు పడింది. శుక్రవారం జిల్లాలోని శృంగవరపుకోట మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా భూమిపూజ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ పట్నం ఎంపీ శ్రీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నారు. రైతులకు భూమికి ఉన్న సంబంధం - తల్లికి బిడ్డకు ఉన్న సంబంధం లాంటిదని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యం

మిగతా 2లో..

## పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా వర్క్ ఫోర్స్



- ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలి
- పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది సద్వినియోగం చేసుకునే బాధ్యత ప్రజలది
- కుప్పంలో ఏబీఐఎస్ ప్రోటీన్స్, ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు


4లో

## అయోధ్య చోరీపై ఆర్‌ఎస్‌ఎస్ ఆందోళన

దోషులను కఠినంగా శిక్షించాల్సిందే... హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని వదలరాదు

ఈ ఘటనతో హిందూ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదు

విచారం వ్యక్తం చేసిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి దత్తాత్రేయ హోసబలే



**న్యూఢిల్లీ,జూలై3(ఆర్ఎన్ఎ):** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఘటనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎసెస్ ఆందోళన వ్యక్తం చేసింది. రాముడి విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే విచారం వ్యక్తం చేశారు. తరతరాలుగా భక్తుల త్యాగాలు, అంకిత భావం కారణంగా శ్రీరామ జన్మభూమిలోని ఈ భారీ ఆలయం రూపుదిద్దుకుందన్నారు. ఆలయ నిర్వహణ లో మరింత పారదర్శకత, జవాబుదా రీతనం ఉండాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించి, ఆలయ నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని

మిగతా 2లో..

## సీఎం విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్యే అరెస్ట్



**చెన్నై, జూలై3(ఆర్ఎన్ఎ):** టీవీకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన డీఎంకే ఎమ్మెల్యే అనితా ఆర్. రాధాకృష్ణన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు బెయిల్ కోసం ఆయన చేసిన అభ్యర్థనను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చడంతో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. జూన్ 20న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విజయ్‌పై రాధాకృష్ణన్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. చిత్ర పరిశ్రమ నుంచి ఆయన రాజకీయ అరంగేట్రాన్ని ఉద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడటంతో పాటు ఓ నటి ప్రస్తావన కూడా తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆయనపై కేసు నమోదైంది. తాజాగా హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో పోలీసులు సదరు ఎమ్మెల్యేను అరెస్టు చేశారు. ఈ అరెస్టును డీఎంకే ఎంపీ కనిమొళి ఖండించారు. ప్రతిపక్షాలపై రాష్ట్ర ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు.

## ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో దొంగల బీభత్సం



**తుని, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాకినాడ జిల్లా తుని - అనకాపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైల్లో ప్రయాణికు లను దుండగులు కత్తులతో బెదిరించి నగదు, సెల్‌ఫోన్లు దోచుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బెంగుళూరు నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో చివరి జనరల్ బోగీలో గురువారం ఉదయం జరిగింది. తుని స్టేషన్ దాటిన తర్వాత బోగీలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తులు చూపించి నగదు, సెల్‌ఫోన్లు ఇవ్వాలని బెదిరించారు. ఈ క్రమంలో ఆరుగురు ప్రయాణికుల నుంచి సుమారు రూ.30 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు దోచుకున్నారు. అనకాపల్లిలో దుండగులు రైలు దిగి పరారయ్యారు. వెంటనే కొందరు ప్రయాణికులు 139కు ఫోన్ చేసి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. తుని నుంచి అనకాపల్లి మధ్య గంట ప్రయాణం సమయంలో ఇదంతా జరిగిందని పోలీసులు గుర్తించారు. బాధితులైన ఆరుగురు ప్రయాణికులు ఒడిశాకు చెందిన వారు. నలుగురు ఈ దోపిడీలో పాల్గొన్నట్లు సమాచారం. వీరంతా విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన వారుగా తెలిసింది. విజయవాడ నుంచి పలు రైళ్లలో అన్నవరం వచ్చి అక్కడ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కి తుని దాటిన తర్వాత దోపిడీకి పాల్పడ్డారు. నిందితుల కోసం సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. దీని ఆధారంగా పాత నేరస్థుల వివరాలతో గాలింపు చేపట్టారు.

## అమరావతిపై వైకాపాది పూటకో మాట.. నిమిషానికొక విష ప్రచారం

- మంత్రి పార్థసారథి



**అమరావతి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధాని అమరావతిపై వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ దృష్టిలో రాష్ట్రాన్ని నిలబెడితే విలన్.. కూల్చేస్తే హీరోలా? అని నిలదీశారు. సీఎం చంద్రబాబు విలన్ ఎలా అయ్యారో

మిగతా 2లో..

భగవంతుడి మీద విశ్వాసం కన్నా ముందు నీ మీద నీకు విశ్వాసాన్ని కలిగి ఉండు. కానీ ఇప్పుడు వచ్చిన ఇబ్బంది రోజు రోజుకీ మన మీద మనమే విశ్వాసాన్ని కోల్పోతున్నాం.

## నేటి మనదేశం సంపాదకీయం

# పార్లమెంట్ సమావేశాలపై కసరత్తు!

ఈ నెలాఖరులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే మరోమారు మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను పెట్టే యోచనలో కేంద్రం ఉంది. అయితే గత సమావేశాల్లో ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. అయినా కేంద్రం తన పట్టును విడవకుండా ముందుకు సాగాలన్న యోచనలో ఉంది. ఈ బిల్లులు పాస్ కావాలంటే మూడోవంతు మెజార్టీ అవసరం. అందుకుత తగ్గ కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. ఇదే సందర్భంలో అన్ని పార్టీలతో చర్చించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలన్న ఆనవాయితీని బిజెపి ఎప్పుడో విడనాడింది. గతంలో సమస్యలు లేదా బిల్లులకు సంబంధించి ముందస్తు అఖిలపక్ష సమావేశాలు జరిగేవి. కానీ అలాంటి ఆనవాయితీని బిజెపి పాటించడం లేదు. దాదాపు 12 ఏళ్లుగా ఏకాభిప్రాయ సాధనలో మోదీ ఏనాడూ ప్రయత్నం చేయలేదు. ఇకపోతే ఏం జరుగుతుందో కూడా ప్రతిపక్షాల ఊహకు కూడా అందదం లేదు. ఈ క్రమంలో ప్రతిసారి బిల్లులను ఎప్పుడు, ఎలా ప్రవేశ పెడతారన్నది కేవలం మోదీ, అమిత్ షాలకు మాత్రమే తెలిసి ఉంటుంది. కేంద్ర మంత్రులు, బిజెపి నేతలకు కూడా వీటిపై సమాచారం ఉండకపోవచ్చు. ఇలా గోప్యత పాటించడం వల్ల వచ్చే లాభం ఏమిటన్నది కూడా వారికే తెలుసు. ఇకపోతే పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కావచ్చని చూచాయగా తెలుస్తోంది. ఇదే సమయంలో సమావేశాలకు ముందుగానే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఉంటుందని సమాచారం వస్తోంది. దీంతో ఎవరు ఉంటారు, ఎవరు పోతారన్న లెక్కల్లో ఎంపిలు ఉన్నారు. ఇది కూడా మోదీ, అమిత్ షాల కనుసన్నల్లోనే జరుగుతుందనడంలో సందేహం లేదు. అందుకే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంటే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోదీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోదీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేకూరింది. బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది. ప్రభుత్వంతో పాటు పార్టీలో కూడా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేసేందుకు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆ స్థానంలో శక్తికాంత దాస్‌ను తీసుకురావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అనురాగ్ ఠాకూర్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పరీక్షల లీకేజీలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత విద్యా శాఖ మంత్రి ధర్మేందర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. మరోవైపు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లగా, జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలను కేబినెట్లోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ రాష్ట్రాల నుంచి మరికొందరు సమర్థ నేతలను మంత్రివర్గం లోకి తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో అక్కడి ఎంపీలకు ప్రాధాన్యత దక్కవచ్చు. శివసేన రెబెల్ వర్గం నుంచి ఒకరిద్దరికి, ముఖ్యంగా శ్రీకాంత్ షిండేకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ మార్పులు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ త్వరలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉండడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ మార్పులు ఉండవచ్చు. ముఖ్యంగా తెలంగాణలో ఉన్న ఇద్దరిలో మార్పు ఉంటుందా అన్న చర్చకూడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్రమంత్రి పదవి దక్కనుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టిడిపి నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒక్కరు కేబినేట్‌లో ఉన్నారు. ఇప్పటికే ఏపీ నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, మరో అదనపు పదవిని టీడీపీకి కేటాయించే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలంగా ఉండటంతో, కేంద్రంలో మరిన్ని అవకాశాలు దక్కేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ మూడో పదవి వస్తే, అది టీడీపీ ఖాతాలోకే వెళ్తుందా లేక జనసేనకు వెళుతుందా, లేక బిజెపికే వెళుతుండా అన్నది చూడాలి. పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సమీకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది. కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. బిజెపికే ఇస్తే మహిళా ఎంపి పురంధేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. ఒకవేళ ప్రాంతీయ సమతుల్యత పాటిస్తే, ఉత్తరాంధ్ర లేదా రాయలసీమ ప్రాంతాలకు ప్రాధాన్యత పెరిగే ఛాన్స్ ఉంది. మంత్రి పదవి దక్కితే ఏపీకి కేంద్ర నిధులు, ప్రాజెక్టుల విషయంలో మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని పార్టీ భావిస్తోంది. మొత్తంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలు, మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల వ్యవహారంతో పాటు మంత్రివర్గ విస్తరణ అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. బిజెపి వ్యూహం ఎలా ఉందన్నది కూడా తెలియనుంది.

# రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధికి చర్యలు

## – ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ తరహాలో అప్పగింత
## – ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం

**అమరావతి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రుషికొండ భవనాల విషయంలో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. హిల్‌టాప్‌లోని భవనాల నిర్వహణ, ఆపరేషన్, మార్కెటింగ్ కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటెస్ట్ ను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది. లీజ్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మోడల్‌లో రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించనుంది. ఎంపికైన ప్రైవేట్ సంస్థ.. ఐదు భవనాల సముదాయాన్ని నిర్వహించనుంది. మొత్తం 9.8 ఎకరాల హిల్‌టాప్ ప్రాజెక్టును మోడల్‌లో ప్రభుత్వం వినియోగించనుంది. రుషికొండ దిగువ ప్రాంతంలో ఉన్న మరో 9 ఎకరాల భూమి అభివృద్ధికి కూడా అవకాశం కల్పించనుంది. హోటళ్లు, రిసార్టులు, పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఏపీటీడీసీ తెలిపింది. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యూయింగ్ ఏరియాలు, ఓపెన్ స్పేస్‌లు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు విధించింది. ప్రస్తుత భవనాలతో పాటు అదనపు అభివృద్ధికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండు ఖాళీ స్థలాల్లో మొత్తం 2,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధికి అవకాశం ఉండగా, అదనంగా సుమారు 4,800 చదరపు మీటర్ల వరకు జీప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇవ్వనుంది. సీఆర్‌జెడ్ నిబంధనలు, చట్టబద్ధ అనుమతుల ప్రకారమే అన్ని నిర్మాణాలు చేపట్టాలని ఏపీటీడీసీ స్పష్టం చేసింది. పెట్టుబడిదారుల ఆసక్తి, ప్రాజెక్టు వాణిజ్య సాధ్యాసాధ్యాలను ఇక్షఎ ద్వారా అంచనా వేసి ఆర్ఎఫ్‌పీ దశలో తుది ఎంపిక ప్రక్రియ జరగనుంది. హోటల్ చైన్లు, రిసార్ట్ డెవలపర్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది.హాస్పిటాలిటీ రంగంలో అనుభవం ఉన్న సంస్థలకే అర్హత కల్పించనున్నట్లు తెలిపింది. మార్చి 31, 2025 నాటికి పాజిటివ్ నెట్‌వర్త్ తప్పనిసరి అని పేర్కొంది. ఇక్షఎ దాఖలుకు చివరి తేదీ జులై 10 సాయంత్రం 5 గంటలుగా నిర్ణయించారు. తుది లీజ్ నిబంధనలు, ఆదాయ భాగస్వామ్యం తదితర అంశాలను ఖీఈఖ దశలో ఖరారు చేయనున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది.

# పొగాకు కొనుగోళ్లలో సిండికేట్ నిర్ధారణ అయితే చర్యలు

## – టొబాకో బోర్డ్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సూచన

**అమరావతి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పొగాకు కొనుగోళ్లలో సిండికేట్ నిర్ధారణ అయితే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డ్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. అన్ని గ్రేడ్‌ల పొగాకును కంపెనీలు తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్నారు. వర్జీనియా పొగాకు కొనుగోళ్లపై మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లు వెంటనే ప్రారంభించాలని.. ప్రతి కంపెనీ తప్పనిసరిగా ఆక్షన్‌లో పాల్గొనాలన్నారు. పొగాకు రిజెక్షన్ రేటును కచ్చితంగా తగ్గించాలని ఆదేశించారు. కంపెనీలు సిండికేట్ అయి, మంచి బేల్స్‌పైనా సీలింగ్ పెట్టి ధరలు తగ్గిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కొనుగోళ్లపై టొబాకో బోర్డు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. టొబాకో బోర్డు సూచనల మేరకు రైతులు పొగాకును ఆక్షన్‌కు తీసుకురావాలని... తద్వారా మంచి ధర లభిస్తుందని, రిజెక్షన్ రేటు తగ్గుతుందని మంత్రి తెలిపారు. టొబాకో బోర్డు, బ్యాంకర్లతో చర్చించి పొగాకును నిల్వ ఉంచాలనుకునే రైతులకు రుణాలు అందిస్తామన్నారు. రైతులకు న్యాయమైన ధర వచ్చేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పొగాకు రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆక్షన్‌లో పాల్గొనని కంపెనీలపై చర్యలు తీసుకోవాలని బోర్డును ఆదేశించారు. సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు స్వయంగా పొగాకు ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లను పరిశీలిస్తున్నారని.. సిండికేట్ నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డ్ ప్రతినిధులకు సూచిస్తున్నారని తెలిపారు. పొగాకు కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు సహించమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా ఎస్‌బీవీ స్వామి, టొబాకో బోర్డు ఛైర్మన్, ఈడీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీ పాల్గొన్నారు.

## రాజోలు టైలర్స్ సంఘ అధ్యక్షుడిగా కడలి

**రాజోలు, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పట్టణ టైలర్స్ సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కామన లక్ష్మణరావు మెమోరియల్ టైలర్స్ కమ్యూనిటీ హాల్ నందు జరిగిన సంఘ సమావేశంలో టైలర్స్ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా :కడలి. వెంకటరమణారావు, కార్యదర్శిగా :పంపన. నాగరాజు, పట్టణ కార్యదర్శిగా: కొండ. సత్యనారాయణ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ అధ్యక్షుడు: వెంకటరమ ణారావు మాట్లాడుతూ టైలర్స్ సంఘం సంక్షేమానికి తాను సాయి శక్తులకృషి చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పూలమాలతో ఘనంగా టైలర్ సంఘ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి. వీర వెంకట సత్యనారాయణ, కడియం .సత్యనారాయణ, గొల్లమందల.విజయ్ కుమార్, మద్దుల .త్రినాథ్, చింతపల్లి .

# పాకిస్థాన్‌లో లోయలో పడ్డ బస్సు

## 40 మంది ప్రయాణికుల దుర్మరణం

**ఇస్లామాబాద్, జూలై 3 (ఆర్ఎన్ఎ):** పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షెరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షెరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# శ్రీవారిని దర్శించుకున్న సినీ ప్రముఖులు

**చలనచిత్ర అభివృద్ధి సంస్థలో సభ్యుడిగా నియమించారన్న సుమన్**

**తిరుపతి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ బోర్డు డైరెక్టర్లలో ఒకరిగా తననూ నియమించారని నటుడు సుమన్ తెలిపారు. ఈ పదవికి తనను నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సిఫార్సు చేసినట్లు వెల్లడించారు. ఈ పదవిని ఒక బాధ్యతగా భావించి ఏపీలో సినిమా షూటింగ్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని సుమన్ స్పష్టం చేశారు. శుక్రవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నిర్మాతలు దిల్‌రాజు, బండ్ల గణెళిశ్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

## – హెచ్చరించిన వాతావరణ శాఖ

**విశాఖపట్టణం, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్ష కురిసే అవకాశం ఉందని, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.

## మొదటి పేజీ తరువాయి

# రాయలసీమ ప్రాంతాన్ని 'ఉక్కుసీమ'గా మారుస్తా




మారుస్తామని హామీ ఇచ్చారు. గతంలో స్టీల్ ప్లాంట్ పేరుతో కొందరు ఐరన్ ఓర్‌ను దోచుకుంటూ స్మగ్లింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రాంతానికి రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకువచ్చామని అన్నారు. అంతేకాదు స్థానికంగా పరిశ్రమలు స్థాపించి ఇక్కడి యువతకే ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమను తీసుకురావడం వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయన్నారు. ఇప్పటివరకూ అక్కడ 19 లక్షల కార్లు తయారయ్యాయని గుర్తుచేశారు. రాయలసీమకు ఎవరి వల్ల నష్టం జరిగింది, ఎవరి హయాంలో మంచి జరిగిందో ప్రజలు చరిత్రను ఒకసారి గుర్తుచేసు కోవాలని కోరారు. స్టీల్ ఎ÷–లాంట్ ఏర్పాటుతో రాయలసీమ చరిత్రలో నవశకం మొదలైంది. రాయలసీమ బిడ్డగా అభివృద్ధి చేసి చూపెడతా. రాయలసీమ అంటే కరవు నేల కాదు జలకళ కాబోతోందన్నారు. ఈ ప్రాంతం హార్టికల్చర్‌హబ్‌గా మారిపోయింది. విధ్వంస పాలనతో నష్టపోయిన రాష్ట్రానికి మళ్లీ ప్రాణం పోస్తున్నాం. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలతో రాయలసీమ బిజీగా మారింది. రాళ్ల సీమ కాదు.. రతనాల సీమ అని చూపిస్తున్నాం. ఇంకా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సజ్జన్ జిందాల్ సిద్ధంగా ఉన్నారు. రాబోయే రోజుల్లో సీమకు అన్నీ మంచి రోజులే. రాయలసీమలో ఎ÷–లాంట్ ఏర్పాటు చేస్తామని ముందే మాట ఇచ్చాం. గతంలో మోసపూరిత శంకుస్థాపనలు చూశాం. 2019 డిసెంబరులో ఒకసారి, 2023లో రెండోసారి భూమిపూజ చేశారు. తట్ట మట్టి అయినా తీశారా.. చిన్న భవనమైనా కట్టారా? అడ్డంకులన్నీ తొలగించుకొని వచ్చాం, 1100 ఎకరాల భూమి ఇచ్చాం. రెండు స్టేజీల్లో రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగనుంది. జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ ఎ÷–లాంట్‌తో ఏపీ.. ఉక్కు రాష్ట్రంగా తయారవుతుంది. విశాఖ మాత్రమే కాదు.. రాయలసీమ కూడా ఉక్కుకు కేంద్రమవుతోందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఒకప్పుడు రాయలసీమలో ఉన్న ఫ్యాక్షన్ సంస్కృతిని అంతం చేశామని, సీమలో పారాల్సింది రక్తం కాదు.. సాగునీరు. ఫ్యాక్షనిజం పోయినప్పటికీ, నేరాలు చేసేవాళ్లు రాజకీయాల్లోకి రావడం దురదృష్టకరం అన్నారు. విధ్వంసమే అజెండాగా పెట్టుకున్న ఒక వ్యక్తి రాష్ట్రానికి ఏం చేయగలరు. 2014లో అమరావతిని రాజధానిగా అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు, అయితే అధికారంలోకి వచ్చాక.. మూడు రాజధానులంటూ నవ్వులపాలు చేశారు. మావిగన్, విజయవాడ అంటూ మతిస్థిమితం లేని వ్యక్తిలా మాట్లాడుతున్నారు. రేపు ఇంకేమంటారో తెలియని పరిస్థితి. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో రౌడీ మూకలు, గంజాయి బ్యాచ్‌లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోంది. ఇలాంటి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం.' అని సీఎం తెలిపారు.

# అమర్‌నాథ్ యాత్రికులకు మోదీ శుభాకాంక్షలు

నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుం దన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

# భావ ప్రకటన స్వేఛ అంటే బూతుల ప్రచారమా?

ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చన్న వ్యూహంతో వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం వ్యూస్ పెంచుకోవడం, బ్లాక్‌మెయిలింగ్ కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరును ఉపయోగించడం సరికాదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రశ్నించే హక్కుంది.. కానీ హద్దులు దాటే హక్కు లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై నియంత్రణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా రుషికొండ ప్యాలెస్ అంశంపైనా మంత్రి స్పందించారు. రుషికొండ ప్యాలెస్‌ను పర్యాటకాభివృద్ధి, ప్రజల సందర్శన కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా పర్యాటక శాఖకు ఏటా సుమారు రూ.7 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇకపై పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

# ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు

ఇస్తోందన్నారు. మొదటి దశలో 535 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు వస్తుందని చెప్పారు. వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 45 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని మంత్రి వెల్లడించారు. ఎస్.కోట నియోజకవర్గం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందనుందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో ఎర్ర బస్సు రానిచోట, ఎయిర్‌పోర్టు ఎలా వస్తుందని జగన్ అన్నారని.. ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి గతంలో వలసలు వెళ్లేవారని.. ఇప్పుడు ఉత్తరాంధ్రకే వివిధ ప్రాంతాలవారు వలసలు వచ్చే పరిస్థితి ఉందని అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే లలిత కుమారి, ఎమ్మెల్సీలు రఘురాజు, శ్రీనివాస్ నాయుడు, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, అధికారులు హాజరయ్యారు.

# అయోధ్య చోరీపై ఆర్ఎస్ఎస్ ఆందోళన

సరిదిద్దాలని హోసబలే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను కోరారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నందున నిందితులకు శిక్షపడే వరకు సంయమనం పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను అవకాశంగా తీసుకొని కొందరు వ్యక్తులు హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో రాజీనామా చేసిన అయోధ్య ఆలయ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలకు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ షో–కాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయ అధికారుల మధ్య జులై 6న జరగనున్న కీలక సమావేశంలో ఈ చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విరాళాల అవకతవకలకు సంబంధించి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని వారిని కోరనున్నట్లు తెలిపాయి. దర్యాప్తు అనంతరం వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రామ్ మందిర్ విరాళాల వివాదంపై ఆర్ఎస్ఎస్ శుక్రవారం స్పందించింది. అయోధ్య హుండీల నుంచి డబ్బులు దొంగతనం చేయటంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన ఎంతో బాధ కలిగించిందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీ దత్తాత్రేయ హొళసబలే న్యూఢిల్లీ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో.. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఆలయ నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కోరారు. దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఘటన కోట్లాది మంది రామభక్తుల నమ్మకాన్ని, హిందూ సమాజం సెంటిమెంట్లను తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన కారణంగా మేము తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురయ్యాం. ఈ దురదృష్టకర సంఘటనను హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తులు తమ స్వార్థం కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. హిందూ సమాజంపై, సనాతన ధర్మంపై బురద జల్లడానికి ఈ వివాదాన్ని ఒక అస్త్రంగా మలచుకునే కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ కష్టసమయంలో హిందూ సమాజమంతా ఎంతో ఓపికను, నిగ్రహాన్ని ప్రదర్శించాలి. ఎలాంటి తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా.. శత్రువుల కుట్రలను తిప్పికొట్టడానికి అందరూ ఐక్యమత్యంగా ఉండాలి. రామమందిరం ఎన్నో తరాల పోరాటాలు, కోట్లాది మంది త్యాగాల ఫలితంగా నిర్మితమైంది. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఆలయ ట్రస్ట్ పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం నాకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమరావతిపై వైకాపాది పూటకో మాట.. నిమిషానికొక విష ప్రచారం

ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "సజ్జల రామకృష్ణారెడ్డి రాజధానిపై అవాకులు, చెవాకులు పేలడం పూర్తిగా హాస్యాస్పదం. మీరు చెప్పే మావిగన్‌లో గుంటూరు ఉంది. అమరావతి కూడా గుంటూరు పరిధిలోనే ఉందని మరిచారా?అమరావతిపై పూటకో మాట.. నిమిషానికొక విష ప్రచారం వైకాపాది. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా.. రాష్ట్రమంతా అమరావతితోనే. అమరావతి అజేయం.. అమరావతే శాశ్వతం" అని మంత్రి పార్థసారథి అన్నారు.

# శ్రీసిటీలో తండ్రి తనయుల పర్యటన సూపర్ సక్సెస్







**శ్రీసిటీ/వరదయ్యపాలెం,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీసిటీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలు విజయవంతమైంది .పెట్టుబడుల ఆకర్షణ ఉపాధి పెంపు.. విద్య, ఉపాధి ప్రగతి రెట్టింపుకు ఈ పర్యటనలు ఎంతో ఉపయోగ పడిందని పారిశ్రామిక వేత్తలు పేర్కొన్నారు. తొలిత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏడవ సరిగా బుధవారం సాయంత్రం శ్రీసిటీకి చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్, ఎస్పి లతోపాటు శ్రీ సిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం హీరో మోటార్స్ రెండవ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ఉపాధి అవకాశాల విస్తరణకు హీరో ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో, ప్రత్యేక భద్రత మధ్య శ్రీసిటీలో పరిశ్రమలు ఏర్పాటు కావడం పురుషులతో సమానంగా స్త్రీలు కూడా ఉపాధి పొందుతుండటం చారిత్రక అంశంగా మిగిలిపోయిందని చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అనంతరం ఆయన హీరో తొలి యూనిట్లో జరుగుతున్న ఉత్పత్తులు, మహిళా కార్మికులతో ఆయన మాట్లాడటం, వారి సాధకబాదాలను అడిగి తెలుసుకున్నారు.

**ఇక్కడే బస – సమీక్ష**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీసిటీలోని ఇన్ గెస్ట్ హౌస్‌లో బుధవారం రాత్రి బస చేశారు. ఆ సందర్భంలో శ్రీ సిటీ చైర్మన్ శీను రాజు, ఎండి రవీంద్రసన్నారెడ్డి లతో సమీక్షించారు ఇప్పటివరకు ఏర్పాటైన పరిశ్రమలు, ఇంకా పరిశ్రమల విస్తరణకు చేపట్టాల్సిన విషయాలపై తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు శ్రీసిటీ విస్తరణకు, భూసేకరణకు సంబంధించి యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన అంశాలపై చర్చించినట్లు సమాచారం బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్ కూడా ఇక్కడే ఉండి సీఎం పర్యటనను విజయవంతం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ముగిసిన అనంతరం ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ హెలికాప్టర్ ద్వారా శ్రీసిటీకి చేరుకున్నారు. ఆయనకు స్థానిక నాయకులు, జిల్లా అధికార యంత్రాంగం, శ్రీసిటీ చైర్మన్ శీను రాజు తదితరులు ఘన స్వాగతం పలికారు. శ్రీసిటీ వాణిజ్య సముదయం ఆవరణలో శ్రీసిటీ నేషనల్ యూనివర్సిటీని ప్రారంభించారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు ఉన్నత యూనివర్సిటీని ఇక్కడ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి, చైర్మన్ శీను రాజు తదితరులు ఎంతో శ్రమించి యూనివర్సిటీ తీసుకురావడం గొప్ప విషయం అన్నారు. తమ ప్రభుత్వం యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఉన్నత చదువులు, నైపుణ్య అభివృద్ధికి చక్కగా కృషి చూస్తోందన్నారు. శ్రీసిటీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడవసారిగా విచ్చేశారు. మంత్రి నారా లోకేష్ నాలుగవ దఫా శ్రీసిటీకి రావడం జరిగింది. మొత్తం మీద తండ్రి, తనయుల పర్యటన శ్రీసిటీలో సూపర్ సక్సెస్ గా సాగింది.

# 'దీప పూజ'కు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

## టీటీడీ జేఈఓ డాక్టర్. ఎ.శరత్ కుమార్



**చంద్రగిరి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి లోని చారిత్రాత్మక శ్రీ కోదండరామస్వామి వారి ఆలయ ప్రాంగణంలో టీటీడీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'శ్రీ మహాలక్ష్మి దీప పూజ' కార్యక్రమ ఏర్పాట్లను టీటీడీ జేఈఓ శరత్ కుమార్ స్వయంగా వచ్చి పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో పూజ నిర్వహించే స్థలాన్ని, భక్తుల కొరకు ఏర్పాటు చేస్తున్న వేదికను, మరియు ఇతర వసతులను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జేఈఓ శరత్ కుమార్ మాట్లాడుతూ, ఈ మహా దీప పూజ కార్యక్రమానికి సుమారు 2000 మందికి పైగా మహిళా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పూజలో పాల్గొనే భక్తులకు ఎక్కడా ఎటువంటి ఆటంకం లేదా అసౌకర్యం కలగకుండా తాగునీరు, చలువ పందిళ్లు, క్యూ లైన్లు, మైక్ సిస్టమ్ మరియు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ముందస్తుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పవిత్రత ఉట్టిపడేలా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలయ ఈఓ , స్థానిక టీటీడీ ఉన్నతాధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జేఈఓ ఆదేశాల మేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన పూజా ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు.

# చిగురువాడ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై రికవరీకి ఆదేశాలు

## - మాజీ సర్పంచ్‌ను బాధ్యుడిగా తేల్చిన డీఎల్‌పీఓ విచారణ
## - సెక్షన్ 52(బి) కింద వసూళ్లకు కలెక్టర్ ఉత్తర్వులు

**చంద్రగిరి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గ పరిధిలోని,తిరుపతి రూరల్ మండలం, చిగురువాడ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అధికారిక విచారణలో తేలడంతో, బాధ్యుడిగా నిర్ధారించిన మాజీ సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి నుంచి సంబంధిత మొత్తాన్ని రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి డి.సుశీలాదేవి ఎండార్స్‌మెంట్ విడుదల చేశారు. చిగురువాడకు చెందిన ముచ్చేలి మోహన్‌రామిరెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేశారు. అనంతరం సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన విచారణ నివేదిక ఆధారంగా హైకోర్టులో డబ్ల్యూపీ నెం.2551/2026 దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారి నుంచి రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం మొత్తాన్ని వసూలు చేసి గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) నిర్వహించిన విచారణలో గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ కావడంతో, అప్పటి డ్రాయింగ్ అధికారిగా వ్యవహరించిన మాజీ సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్ కుమార్ రెడ్డిని బాధ్యుడిగా పేర్కొన్నారు. ఆ నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ రికవరీ చట్టంలోని సెక్షన్–52(బి) కింద రికవరీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీలో దుర్వినియోగమైన నిధులను వసూలు చేసేందుకు తిరుపతి రూరల్ మండల ఎంపీడీవోను రికవరీ అధికారిగా నియమించారు. రెవెన్యూ రికవరీ చట్టం–1844 ప్రకారం వసూలు చేసిన మొత్తాన్ని చిగురువాడ గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసి, చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికను జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల అమలులో భాగంగానే ఈ రికవరీ ప్రక్రియ ప్రారంభమైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి హామీ

**శ్రీకాళహస్తి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని తిరుపతి పార్లమెంట్ నాయి బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఫెడరేషన్ నిధులు, ఆధునిక సెలూన్ షాపులకు సబ్సిడీలు, 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్, కార్పొరేషన్ ద్వారా రుణాలు వంటి అంశాలపై వినతిపత్రం అందజేశారు. లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ, నాయి బ్రాహ్మణుల సంక్షేమం టీడీపీ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని తెలిపారు. వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోట చంద్రశేఖర్ కృషిని అభినందించారు.

# ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీకి ఘన సన్మానం



**నాయుడుపేట, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ ఆధ్వర్యంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ని ఘనంగా సన్మానించి,ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆమవరపు సత్యం, నిత్యా కృష్ణారెడ్డి, పలుకూరు ముత్యాలయ్య, వినుకొండ ధనుంజయ, ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు, నాగరాజు పలువురు నాయకులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, ప్రజా వేదిక కార్యక్రమానికి ఆహ్వానించారు.

## జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో
# సమస్యల్లో ఇంటర్ బోర్డ్ సిబ్బంది

**చంద్రగిరి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ఇంటర్మీడియట్ బోర్డు సిబ్బంది ఎన్నో సమస్యలకు గురవుతున్నారని ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ టీచింగ్ అసోసియేషన్ అన్నారు. చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు శుక్రవారం వారు ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ రంజిత్ భాషాను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో నుంచి వచ్చిన సిబ్బంది ఎదుర్కొంటున్న సర్వీసు సమస్యలను కమిషనర్‌కు వివరించారు. అందరితో పాటు ఎయిడెడ్ కళాశాలల నుంచి వచ్చిన సిబ్బంది కూడా ప్రమోషన్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. వారు చెప్పిన సమస్యలను విని అన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రతాప్ గాంధీ, కార్యదర్శి మాధవ నివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి ముని శంకర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మాధవ రావు, షణ్ముఖ రెడ్డి, గిరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచాలి

## - రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ ఎ.బాబు



**తిరుపతి సిటీ, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జీఎస్టీ ఆడిటర్లు నిరంతర తనిఖీల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచాలని రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ ఎ.బాబు ఆదేశించారు. శుక్రవారం తిరుపతి జీఎస్టీ కార్యాలయంలో నిర్వహించిన "ఎకనామిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్" అంశంపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్ షాప్ లో పాల్గొన్న అనంతరం, రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ ఎ. బాబు, తిరుపతిలోని ప్రాంతీయ జీఎస్టీఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని సందర్శించి పనితీరును సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించే లక్ష్యంతో 2022–23 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాంతీయ జీఎస్టీఆడిట్, ఎన్‌ఫోర్స్ మెంట్ కార్యాలయం, చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు మరియు ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు వాణిజ్య పన్నుల విభాగాల పరిధిలో జీఎస్టీఆడిట్లు మరియు లక్ష్యిత తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ కార్యాలయంలో ఉప కమిషనర్లు, సహాయ కమిషనర్లు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు మరియు ఇతర సిబ్బందితో కూడిన ఆరు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.సమీక్షా సమావేశంలో ప్రధాన కమిషనర్ ప్రాంతీయ జీఎస్టీఆడిట్ ఉ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ పనితీరును అభినందించారు. గత నాలుగు సంవత్సరాల్లో మొత్తం 978 జీఎస్టీ ఆడిట్లు చేపట్టగా, వాటిలో 821 ఆడిట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ఆడిట్ల ద్వారా రూ.1,233.92 కోట్ల పన్ను డిమాండ్ నిర్ధారించబడగా, ఇప్పటివరకు రూ.260.48 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు వసూలు చేసినట్లు వెల్లడించారు.అదేవిధంగా, మొత్తం 186 తనిఖీలు నిర్వహించగా, వాటిలో 99 తనిఖీలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ తనిఖీల ద్వారా రూ.491.25 కోట్ల పన్ను డిమాండ్ గుర్తించబడగా, ఇప్పటివరకు రూ.89.88 కోట్ల మేర వసూళ్లు జరిగినట్లు వివరించారు.జీఎస్టీఆడిట్లు, తనిఖీల సందర్భంగా గుర్తించిన ముఖ్యమైన అంశాలు, ఉత్తమ ఆచరణలు, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి దోహదపడే కేసులను క్రమబద్ధంగా డాక్యుమెంట్ చేసి, వాటిని శాఖ పోర్టల్‌లో అందుబాటులో ఉంచాలని ప్రధాన కమిషనర్ అధికారులను ఆదేశించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని విభాగాల మధ్య పరిజ్ఞాన మార్పిడి జరిగి, ఆడిట్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా, కృత్రిమ మేధస్సు డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి, ఆడిట్ సామర్థ్యాన్ని పెంపొందించడం, పన్ను చెల్లింపుదారుల అనుసరణ ను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించడం, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు వినూత్న చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో ఎస్. శేఖర్, అదనపు కమిషనర్ (రాష్ట్ర పన్నులు), కె.నాగేంద్ర, అదనపు కమిషనర్ (రాష్ట్ర పన్నులు), ఉప కమిషనర్లు, సహాయ కమిషనర్లు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు, ప్రాంతీయ జీఎస్టీఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా


# నైపుణ్యాలతోనే ఉపాధి సొంతం

## - స్కిల్ హబ్ జర్మన్ నర్సింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించిన
## - ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిఎండి



**తిరుపతి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కాలా అనుమానంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని స్కిల్స్ నేర్చుకోవడం ద్వారా ఉపాధిని సొంతం చేసుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండి గణేష్ కుమార్ తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో తిరుపతిలోని స్కిల్ హబ్ న్యాక్ ట్రైనింగ్ సెంటర్ తిరుపతిలో శిక్షణ తీసుకుంటున్న 90 విద్యార్థులతో శుక్రవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. శిక్షణ గురించి మెలుకువలు యువతని అడిగి తెలుసుకున్నారు, యువత దగ్గర నుండి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. వాళ్లకి కావలసినటువంటి శిక్షణ విధివిధానాలను ఆయన పరిశీలించారు. రాబోవు రోజుల్లో ఇలాంటి శిక్షణలు రాష్ట్రమంతటా ఎక్కువగా జరపటానికి తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎలక్ట్రిషన్, ప్లంబర్ మొదలగు కోర్సులు చేస్తున్న వారికి ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాలు కల్పిస్తామని ఆయన తెలియజేశారు. శ్రీకాళహస్తిలోని ఎస్‌విఏ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ స్కిల్ హబ్‌ను ఆయన సందర్శించి, అక్కడ జరుగుతున్నా వెబ్ డెవలప్మెంట్ శిక్షణ గురించి యువత ని అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్, ట్రైనర్‌కి కోర్స్ గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మరో శిక్షణ సెంటర్,శ్రీ పద్మావతి నర్సింగ్ కాలేజీలో శిక్షణ పొందుతున్న మూడవ, నాలుగవ, సంవత్సరం నర్సింగ్ విద్యార్థినీలతో గణేష్ కుమార్ మాట్లాడుతూ శిక్షణ వివరాలు, జర్మన్ భాషా ప్రావీణ్యత, ప్రాముఖ్యత, విదేశీ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా ఇప్పటికే 6 మంది మహిళలు జర్మనీలో ఉద్యోగ అవకాశాలకు అర్హత సాధించారు. వీరు ప్రస్తుతం కేరళలో బీటు స్థాయి శిక్షణను పూర్తి చేసి, మరికొద్ది రోజుల్లో జర్మనీ దేశంలో ఉద్యోగాల్లో చేరనున్నారు. ఈ సందర్భంగా జర్మన్‌లో ఉద్యోగ అర్హత సాధించిన మహిళలను గణేష్ కుమార్ అభినందించి, వారి భవిష్యత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాబోవు రోజుల్లో జర్మన్ లాంగ్వేజ్ నర్సింగ్ చదువుతున్న విద్యార్థులకు సిలబస్‌లో యాడ్ చేయడం జరుగుతుందని మరియు వాళ్లకి కావలసినటువంటి సదుపాయాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ఆర్ఇఓ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్, ఆర్. లోకనాథం,జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, న్యాక్ ట్రైనింగ్ సెంటర్ యాజమాన్యం, పద్మావతి నర్సింగ్ కాలేజ్ తిరుపతి యాజమాన్యం ఏపీఎస్ఎస్‌డిసి సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి



**సత్యవేడు, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సత్యవేడు పట్టణంలో గత కొన్ని నెలలుగా, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద కనిపిస్తున్న తీవ్ర ట్రాఫిక్ జామ్ వల్ల విద్యార్థులు, శ్రీసిటీ పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, సాధారణ ప్రయాణికులు, ట్రాఫిక్ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీసిటీ పరిశ్రమంలో పనిచేసే కార్మికులు, అనుకున్న సమయానికి హాజరు కాకపోవడంతో, కంపెనీ నిబంధనల ప్రకారం ఒక గంట పరిమిషన్ అప్లై చేయవలసిందే ప్రైవేట్ బస్సుల అనియంత్రిత పార్కింగ్ కారణంగా, ప్రతి రోజు ట్రాఫిక్ జామ్ భారీగా ఏర్పడుతున్నాయని, స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది ప్రైవేట్ యాజమాన్యాలు, స్థానిక ప్రభుత్వ అధికారులను కలిసి ఈ అనుమతులను పొందుతున్నారని అనుమానాలు ఉన్నాయి. ఈ సమస్యను సామూహికంగా పరిగణించి చూడాలని, స్థానిక ప్రభుత్వ సంస్థలు ఈ విషయానికి తక్షణమే చర్య తీసుకునేలా ప్రభుత్వ అధికారులనుకోరుకుంటూ ప్రజల భద్రత, పట్టణ వాతావరణాన్ని కాపాడాలని, ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పదించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుకుంటున్నారు.

# సామంతమల్లం చెరువుపై మట్టి మాఫియా పగడాలు



**సూళ్లూరుపేట, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సూళ్లూరుపేట మండలం సామంతమల్లం చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గత వారం రోజులుగా ఒక జేసీబీ, సుమారు 20 ట్రాక్టర్లతో ప్రతిరోజూ చెరువు నుంచి మట్టిని తరలించి విక్రయిస్తున్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన ఓ స్థానిక నాయకుడి పాత్ర ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాకు ఎమ్మెల్యే అండ ఉంది, నన్నెవరూ అడ్డుకోలేరు అంటూ సదరు నాయకుడు అధికారులకే సవాల్ విసురుతున్నట్లు ఆరోపిస్తున్నారు. చెరువు పరిరక్షణకు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు అధికార పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికలపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉందని అంటున్నారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి నిజానిజాలు వెలికి తీయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాలల హక్కుల పరిరక్షణలో రాజీ లేదు

## - పోక్సో కేసులు, బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
## - బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి

**తిరుపతి సిటీ, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణ పై మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం, కార్మిక శాఖ, విద్యా శాఖ, పోలీసు శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీ బాబు, శ్రీనివాసమూర్తి, పద్మలత, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి శాఖ అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బాల కార్మికుల నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం, పోక్సో కేసుల దర్యాప్తు, బాధితుల పునరావాసం, బాలల అక్రమ రవాణా నివారణ, టీనేజ్ ప్రెగ్నెన్సీ, గంజాయి కేసులు, పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యలో చేర్చడం వంటి అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. పోక్సో కేసుల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, బాధిత పిల్లలకు అందించిన పరిహారం, పునరావాస చర్యలు, జనన ధ్రువీకరణ పత్రాల జారీ, వివిధ శాఖల సమన్వయంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్పొరేట్ బిమరియు ప్రైవేటు విద్యాసంస్థల్లో బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు పరిశుభ్రమైన వసతి, సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం, నాణ్యమైన ఆహారం, ఆరోగ్య సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ఏ శాఖ నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమని, జిల్లా స్థాయిలో గుర్తించిన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికతో పాటు తగిన సిఫారసులు సమర్పిస్తామని చైర్మన్ తెలిపారు.కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీ బాబు మాట్లాడుతూ బాలల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బాలుడి సంక్షేమం, భద్రత రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. సమావేశానంతరం బాల్య వివాహాల చట్టవిరుద్ధం పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశం లో డి ఆర్ ఓ నరసింహులు, ఐసిడిఎస్ పిడి, డిఎం అండ్ హెచ్ ఓ, జిల్లా బాలల సంరక్షణ అధికారి, డీఈవో, ఎస్సీ, ఎస్టీ బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, కార్మిక శాఖ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా వర్క్ ఫోర్స్

- ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలి
- పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది సద్వినియోగం చేసుకునే బాధ్యత ప్రజలది
- కుప్పంలో ఏబీఐఎస్ ప్రోటీన్స్, ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు





**కుప్పం, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పంలో వివిధ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం కుప్పం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి నేరుగా కుప్పం వచ్చారు. కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె మండలం పొగురుపల్లెలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో భాగంగా రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఏబీఐఎస్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చికెన్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు ఏపీఐఐసి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఎంఎస్ఎంఈ పార్క్ ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ రెండు ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి, రైతులకు మార్కెట్, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించనున్నాయి. గుడుపల్లె మండలం పొగురుపల్లె గ్రామంలో 30.75 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఏబీఐఎస్ ప్రోటీన్స్ గ్రీన్‌ఫీల్డ్ పౌల్ట్రీ, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. ఈ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు ప్లాంట్ పనితీరును పరిశీలించారు. ప్లాంట్లో ఏయే విభాగాలు ఏ విధంగా పని చేస్తాయన్న అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు కంపెనీకి చెందిన యాజమాన్య ప్రతినిధులు వివరించారు. ఆ సంస్థ నిర్వహించిన జాబ్ ఫెయిర్ లో ఉద్యోగాలు పొందిన యువతకు సీఎం చంద్రబాబు నియామక పత్రాలు అందించారు. ఈ నెల నుంచే వాణిజ్య ఉత్పత్తిని ఆ సంస్థ ప్రారంభించనుంది. ఈ పరిశ్రమ ద్వారా మొత్తం 1,400 మందికి ఉపాధి లభించనుండగా, అందులో 700 ప్రత్యక్ష, 700 పరోక్ష ఉద్యోగాలు ఉన్నాయి. ప్రారంభ దశలోనే 300 నుంచి 400 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ యూనిట్ ద్వారా స్థానిక పౌల్ట్రీ రైతులకు గిట్టుబాటు ధరలకు మార్కెట్ లభించడంతో పాటు, ఒప్పంద పద్ధతిలో కోళ్ల పెంపకానికి అవకాశాలు ఏర్పడనున్నాయి. ఫీడ్ సరఫరా, రవాణా, అనుబంధ రంగాలకు కూడా ఈ పరిశ్రమ ఊతం ఇవ్వనుంది. పొగురుపల్లెలో 44.58 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఘా××జ ఎంఎస్ఎంఈ పార్క్ ను కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ పార్కులో 167 పారిశ్రామిక ప్లాట్లను జూలై నెల నుంచే పారిశ్రామికవేత్తలకు కేటాయింపు ప్రక్రియ ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు ఒకేచోట కల్పించడం ద్వారా కొత్త పరిశ్రమలు వేగంగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీనివల్ల స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, కుప్పం పారిశ్రామిక హబ్‌గా మరింత వేగంగా అభివృద్ధి చెందేందుకు ఈ పార్క్ దోహదపడనుంది. ఇక 7,489 మంది ఎస్సీ, ఎస్టీలకు లబ్ది చేకూరేలా రూ. 28 కోట్లతో ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ ప్రాజెక్టును సీఎం ప్రారంభించారు. అలాగే కనమాన పల్లి, గంగాపురం, టీ సముద్రం, కృష్ణానగర్, బళ్ల గ్రామాల్లో రూ.25 కోట్లతో రెస్కోకు చెందిన 5 సబ్ స్టేషన్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

**పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం**

కుప్పం చేరుకున్న ముఖ్యమంత్రికి ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పొగురుపల్లెకు బయలుదేరిన సీఎంకు దారి పొడవునా గ్రామస్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..." కుప్పం నియోజకవర్గ చరిత్రలో ఇవాళ మరిచిపోలేని రోజు. ఏబీఐఎస్ ప్రోటీన్స్ సంస్థ ఇప్పటికే 400 మందికి ఉపాధి కల్పించింది. గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఆధునిక టెక్నాలజీతో దేశంలో అతి పెద్ద చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉంది. స్థానిక కోళ్ల పెంపకం దారులు ఈ సంస్థ ద్వారా లబ్ది పొందుతారు. రైతులకు ప్రయోజనం కలగటంతో పాటు పరోక్షంగా చాలా మందికి ఉపాధి లభిస్తుంది. చాలా తక్కువ సమయంలో ఈ ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి... కార్యకలాపాలను ప్రారంభించేలా చేసినందుకు సంస్థకు అభినందనలు. కుప్పం నియోజకవర్గానికి రైల్, రోడ్, ఎయిర్ కనెక్టివిటీని పెంచుతున్నాం. ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు.. జీవన ప్రమాణాలను పెంచేలా పరిశ్రమలు తెచ్చాం. వస్తున్న పరిశ్రమలకు అనుగుణంగా వర్క్ ఫోర్స్ కూడా సిద్ధం కావాలి. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో దృష్టి పెట్టాలి. కుప్పానికి పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది... దాన్ని అందిపుచ్చుకునే బాధ్యత ప్రజలది. పరిశ్రమలు, సేవా, వ్యవసాయ రంగాల్లో కుప్పాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పులివెందులలో లింగాల మండలంలో ఉద్యాన పంటలపై దృష్టి పెడితే.. అక్కడి ప్రజలు దాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వారి తలసరి ఆదాయం రూ.7.30 లక్షలు. రాయలసీమకు పూర్వోదయ ప్రాజెక్టును తెస్తాం. యువత ఉద్యోగాలు చేయడమే కాదు.. ఉద్యోగాలిచ్చే స్థితికి చేరాలి. నైపుణ్యాలు పెంచుకుని.. వినూత్నంగా ఆలోచిస్తే యువత అభివృద్ధి సాధ్యమవుతుంది." అని సీఎం చంద్రబాబు చెప్పారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, చిత్తూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అపోలో ప్రస్థానానికి బలమైన పునాదులు

- వినోద్ భట్‌కు ఘన వీడ్కోలు - అభివృద్ధి ప్రస్థానాన్ని స్మరించిన యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు



**చిత్తూరు,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ది అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా విశ్వవిద్యాలయ అభివృద్ధికి బలమైన పునాదులు వేసిన ప్రొఫెసర్ హెచ్.వినోద్ భట్‌కు శుక్రవారం ఘన వీడ్కోలు పలికారు. డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో యాజమాన్యం, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు, కార్పొరేట్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. ఐదేళ్లపాటు విశ్వవిద్యాలయ అభివృద్ధికి నాయకత్వం వహించిన ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి యూనివర్సిటీ ఛాన్సలర్ డా.ప్రీతా రెడ్డి, నూతన వైస్ చాన్సలర్ డా.నితిన్ ఎం.నాగర్కర్, అపోలో నాలెడ్జ్ సీఈఓ శివరామకృష్ణన్ వెంకటేశ్వరన్, రిజిస్ట్రార్ అనిల్ కుమార్ ఎస్,ప్రో వైస్ చాన్సలర్ డా.ఆల్ఫ్రెడ్ జె. ఆగస్టిన్, కార్పొరేట్ అధికారులు, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం ప్రారంభ దశలోనే నాణ్యమైన విద్య, పరిశోధన, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యా సంస్కృతికి ప్రొఫెసర్ భట్ బలమైన పునాదులు వేశారని, ఆయన నాయకత్వంలో ది అపోలో యూనివర్సిటీ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిందని కొనియాడారు. ఛాన్సలర్ డా.ప్రీతా రెడ్డి మాట్లాడుతూ, ప్రొఫెసర్ భట్ నెలకొల్పిన అకడమిక్ ప్రమాణాలు, సంస్థాగత సంస్కృతి విశ్వవిద్యాలయ అభివృద్ధికి శాశ్వత మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. నూతన వైస్ చాన్సలర్ డా. నితిన్ ఎం.నాగర్కర్ మాట్లాడుతూ, ఆయన వేసిన బలమైన పునాదులపై విశ్వవిద్యాలయాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. అపోలో నాలెడ్జ్ సీఈఓ శివరామకృష్ణన్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ, విలువలు, దూరదృష్టి, సమర్థ నాయకత్వంతోనే గొప్ప విద్యాసంస్థలు రూపుదిద్దుకుంటాయని, ఆ లక్షణాలను ప్రొఫెసర్ భట్ సంస్థలో నెలకొల్పారని చెప్పారు. అపోలో సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, ఛాన్సలర్ ఎమెరిటస్ డా. ప్రతాప్ సి.రెడ్డి, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా.సంగీతా రెడ్డి, ప్రో ఛాన్సలర్ డా.రవి రాజు ప్రత్యేక వీడియో సందేశాల ద్వారా ప్రొఫెసర్ భట్ సేవలను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వీడ్కోలు ప్రసంగంలో ప్రొఫెసర్ హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ, అపోలో యూనివర్సిటీలో గడిపిన కాలం తన జీవితంలో మరపురాని అధ్యాయమని అన్నారు. యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల సహకారంతోనే విశ్వవిద్యాలయం ఈ స్థాయికి చేరుకుందని పేర్కొంటూ, కొత్త నాయకత్వంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రొఫెసర్ హెచ్. వినోద్ భట్, ఆయన సతీమణి డా.పార్వతి భట్‌లను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ నాయకత్వం, సరళత, విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయతను కొనియాడారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిత్తూరులో డెంగీ నివారణ చర్యలు: కమిషనర్

**చిత్తూరు, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక పరిధిలో డెంగీ నివారణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి నరసింహప్రసాద్ చెప్పారు. డెంగీ నివారణ మాసోత్సవాలు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సంతపేట విజయలక్ష్మి కాలనీలోని నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. డెంగీ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో అన్ని వార్డుల పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి ఫీవర్ సర్వే, లార్వాల గుర్తింపు సర్వే నిర్వహించాలన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, లార్వాలను గుర్తించిన ప్రాంతాల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, నివారణ చర్యలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్.పి.లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, స్వర్ణ వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## పుంగనూరులో రాజకీయ పార్టీలతో డీఆర్వో సమీక్ష



**పుంగనూరు,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయంలో అన్నమయ్య జిల్లా డీఆర్వో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నియోజకవర్గ వ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఇప్పటివరకు 698.2 శాతం ఇన్యిరేషన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ 47.5 శాతం పూర్తయిందని వెల్లడించారు. జూలై 14వ తేదీ వరకు నమోదు గడువు ఉన్నందున, అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని బీఎల్‌వోల వద్ద నుంచి అవసరమైన దరఖాస్తు పత్రాలను తీసుకుని నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.అదేవిధంగా ప్రతి రాజకీయ పార్టీకి చెందిన బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ రాము, రెవిన్యూ ఇన్స్పెక్టర్ పణి కుమార్, (టీ.పీ.ఓ) జగదీష్‌తో పాటు రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జేఎస్పీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కార్యక్రమం పొడిగింపు

**చిత్తూరు,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనసేన పార్టీ ( జేఎస్పీ ) నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కార్యక్రమాన్ని మరో రెండు రెండు రోజులు పొడిగించినట్లు జేఎస్పీ జిల్లా కార్యదర్శి దేవినేని యశ్వంత్ తెలిపారు. శుక్రవారం సాయంత్రంతో ముగియాల్సిన కమిటీ కార్యక్రమాన్ని శని, ఆదివారాలు (మరో రెండు రోజులు) వరకు పొడిగిస్తూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

ఈ అవకాశాన్ని జేఎస్పీ శ్రేణులు సద్వినియోగం చేసుకొని పార్టీకి సంబంధించి మార్గదర్శ కాలకు అనుగుణంగా తమకు నచ్చిన పదవికి దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం దేవినేని యశ్వంత్ ఒక ప్రకటన విడుదల చేశారు.

## ఓటరు జాబితా సవరణను సద్వినియోగం చేసుకోండి: ఎంపీపీ

**రామసముద్రం, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని మలేనత్తం పంచాయతీలో వైసీపీ నాయకుడు, ఎంపీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకోవడంతో పాటు కొత్తగా అర్హత పొందిన వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జాబితాలోని తప్పులను సరిచేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అమూల్యమైందని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీపీ రమణారెడ్డి కోరారు.



# చిత్తూరు జిల్లా

## టమోటా ధరలు పతనంతో రైతుల ధర్నా



**పలమనేరు,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం టమోటా ధరలు ఒక్కసారిగా పతనం కావడంతో రైతులు కోపోద్రేతులై ఒక్కసారిగా చెన్నై బెంగళూరు జాతీయ రహదారిపై రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ ధర్నా విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ సెక్రటరీ వి.సంజీవ్ కుమార్ రైతుల వద్దకు వెళ్లి సమస్యలు దగ్గర పూర్వకంగా తెలియజేయండి అని రైతులకు తెలియజేశారు. ఇటు కర్ణాటక ప్రాంతంలో ఒక్క టమాటా బాక్స్ ధర రూ.250 పలకడంతో పలమనేరులోని మార్కెట్ యార్డ్‌లో ఈరోజు ఒక్క బాక్స్ ధర రూ.150 పలకడంతో తేడా రూ.100 ఉండడంతో రైతులు ఆయన దృష్టికి తెలియజేశారు. రైతులు తాము పండించిన టమోటాలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కోపోద్రిక్తులై మార్కెట్ యార్డ్ గేట్లను మూసివేయడంతో అక్కడ ట్రాఫిక్ సమస్య మొదలైంది. అంతలో అక్కడికి పోలీసులు చేరుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. అందరూ రైతులు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కి వెళ్లి అధికారులతో చర్చలు జరిపారు. మండి యజమానులు అందరినీ పిలిపించి చర్చిస్తానని రైతులకు తెలియజేశారు. వారు అప్పటికి శాంతించకపోవడంతో సెక్రెటరీ రైతులందరితో అమరస్యంగా సమస్యలు పరిష్కరిస్తానని వారికి తెలియజేశారు. ప్రధానంగా టమోటా ధరలు సమాంతరంగా పడిపోవడంతో రైతులు తమకు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తాము చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని వాపోయారు. ఇలాంటి సమస్య ఎప్పుడు ఈ మార్కెట్ యార్డ్‌లో ఉత్పన్నం కాలేదని ఇప్పుడే ఈ సమస్య మొదలైందని తెలిపారు. రైతులు సమస్యలు తక్షణమే పరిష్కరిస్తానని మార్కెట్ కమిటీ కార్యదర్శి రైతులకు తెలిపారు.

## బుల్లెట్ ట్రైన్ స్టాప్ కోసం కొనసాగుతున్న నిరసనలు





**పలమనేరు, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ అభివృద్ధి, ప్రజల రవాణా సౌకర్యాల దృష్ట్యా ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్‌కు పలమనేరులో స్టాప్ కల్పించాలని డిమాండ్ చేస్తూ, పలమనేరు పరిరక్షణ సమితి(పిపిఎస్) ఆధ్వర్యం లో శుక్రవారం ఎన్‌జీఓ హోమ్ వద్ద శాంతియుత ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.పి.ఎస్ నాయకులు మాట్లాడుతూ బెంగళూరు –చెన్నై కారిడార్‌లో వ్యూహాత్మకంగా ఉన్న పలమనేరు ప్రాంతానికి బుల్లెట్ ట్రైన్ స్టాప్ కల్పించడం వల్ల చిత్తూరు జిల్లా ప్రజలకు, వ్యాపార వర్గాలకు, విద్యార్థులకు ఉద్యోగులకు విశేష ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఇప్పటికే మూడు దఫాలుగా శాంతియుత నిరసనలు నిర్వహించినట్లు పేర్కొంటూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ అంశంపై ప్రత్యేక చొరవ చూపి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పలమనేరుకు బుల్లెట్ ట్రైన్ స్టాప్ మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పలమనేరు అభివృద్ధి, భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం ఈ ఉద్యమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తామని పి.పి.ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పి.పి.ఎస్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, యువత, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ హక్కుల నిర్ణయంతో టీడీపీలోకి వందలాది మంది రైతులు



**కుప్పం,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గత 60 సంవత్సరాలుగా భూ హక్కుల కోసం ఎదురుచూస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కంగుంది పంచాయతీ రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వందలాది రైతు కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. కుప్పం నియోజకవర్గంలోని కంగుంది పంచాయతీ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో అంబాపురం గ్రామానికి చెందిన 35 కుటుంబాలు, రామలగుట్ట గ్రామానికి చెందిన 25 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి.ఎస్.మునిరత్నం, పీకేఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టీటీడీ పాలకమండలి సభ్యులు శాంతారామ్ నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దశాబ్దాలుగా భూ హక్కుల కోసం ఎదురు చూస్తున్న రైతులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించడం ద్వారా రైతుల జీవితాలకు శాశ్వత భరోసా కల్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. రైతుల సంక్షేమం, భూ హక్కుల పరిరక్షణ, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆ కార్యక్రమాల ఫలితంగానే ప్రజల్లో ప్రభుత్వంపై, తెలుగుదేశం పార్టీపై విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, గ్రామీణ ప్రగతి, రైతుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన రైతు కుటుంబాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలకు మద్దతు ప్రకటిస్తూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే



**కందుకూరు,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కందుకూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో, నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం జరగనుంది. పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ నేతలతో కలిసి శుక్రవారం సాయంత్రం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు వేలాదిగా హాజరవుతారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. తాగునీరు, భోజన వసతులపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకుడు రాయపాటి శ్రీనివాసరావు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

## భక్తులకు అన్నదానం

**పలమనేరు,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ సమీపంలోని ఘంటా వూరు బీసీ కాలనీలో వెలసియుండు శ్రీశ్రీ తిరుపతి గంగమ్మ దేవస్థానం నందు శుక్రవారం సాయంకాలం గంగమ్మ తల్లికి, మారెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు అభిషేకాలు శ్రీశ్రీ తిరుపతి గంగమ్మ గుడి దేవస్థానం చైర్మన్, స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్ మురుగన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం, శుక్రవారం, తోపాటు పౌర్ణమి రోజు గంగమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణతో పాటు పూజలు చేపట్టడం జరుగుతుంది. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు భక్తిశ్రద్ధలతో గంగమ్మ తల్లిని దర్శించుకోవడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మురుగన్ కోరారు.

# ఈఏపీసెట్ నందు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సువర్ణావకాశం

## - మిట్స్ యూనివర్సిటీలో బీటెక్ కోర్సులకు ప్రవేశాలు ప్రారంభం



**మదనపల్లె/ కురబలకోట, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో 2026-27 విద్యా సంవత్సరానికి (ఈఏపీసెట్) ద్వారా బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఈఏపీసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక ఫీజు రాయితీలు అందిస్తున్నామని, వారి ర్యాంకుకు అనుగుణంగా తక్కువ ఫీజుతో నాణ్యమైన సాంకేతిక విద్యను అభ్యసించే సువర్ణ అవకాశాన్ని మిట్స్ కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విద్యా సంవత్సరానికి యూనివర్సిటీలో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, బయోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సైబర్ సెక్యూరిటీ)లు ఉన్నాయని ఆయన అన్నారు. ప్రపంచ స్థాయి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఆధునిక పాఠ్య ప్రణాళిక, అత్యాధునిక ప్రయోగశాలలు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, పరిశ్రమలతో భాగస్వామ్యాలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు,పరిశోధనకు ప్రాధాన్యత, అత్యుత్తమ ప్లేస్‌మెంట్ సదుపాయాలతో మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తోందని డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి తెలిపారు. ఈఏపీసెట్ అర్హత సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు యూనివర్సిటీని నేరుగా సందర్శించి కోర్సులు, ఫీజు రాయితీలు, ప్రవేశాల వివరాలను తెలుసుకొని వెంటనే అడ్మిషన్లు పొందాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రో ఛాన్సలర్ నాదెళ్ల ద్వారకానాథ్,వైస్ ఛాన్సలర్ (ఇన్‌చార్జ్) డాక్టర్ సి.యువరాజ్, రిజిస్ట్రార్ (ఇన్‌చార్జ్) డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

## జిల్లాలో పోలీసుల ముమ్మర తనిఖీలు



**మదనపల్లె,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు జిల్లావ్యాప్తంగా రాత్రివేళల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. రాత్రి విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది,నైట్ బీట్ బృందాల పనితీరును పోలీసు అధికారులు స్వయంగా తనిఖీ చేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో అనవసరంగా అనుమానాస్పదంగా తిరిగే వారిని అత్యాధునిక ఫింగర్ ప్రింట్ పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. డ్రైవర్లు నిద్రమత్తు వల్ల ప్రమాదాల బారిన పడకుండా వాహనాలు నిలిపి ముఖం కడుక్కునేలా చేసి సురక్షితంగా పంపుతున్నారు. ప్రధాన కూడళ్లలో విస్తృతంగా తనిఖీలు చేస్తూ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలు జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ నిరంతరాయంగా కొనసాగుతాయని పోలీస్ యంత్రాంగం తెలిపింది.

## టిబి రహిత రేపటి కోసం హెచ్‌హెచ్ ఛాతీ ఎక్స్-రే చేయించుకోవాలి



**పీలేరు, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశాన్ని క్షయవ్యాధి(టిబి) రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న 100 రోజుల ప్రత్యేక టిబి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పీలేరు పట్టణంలోని సాయిరాం వీధిలో శనివారం నిర్వహించిన మొబైల్ హెచ్‌హెచ్ ఛాతీ ఎక్స్-రే శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మొత్తం 108 మందికి ఉచితంగా ఛాతీ ఎక్స్-రేలు నిర్వహించి, టిబి వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరీక్షలు చేపట్టినట్లు పీలేరు టిబి నియంత్రణ విభాగ పర్యవేక్షకులు మోహన్, పవన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. టిబి వ్యాధిని నిర్లక్ష్యం చేయడం వల్ల అది ప్రాణాంతకంగా మారే అవకాశముందని, కొన్నిసార్లు స్పష్టమైన లక్షణాలు కనిపించకుండానే వ్యాధి తీవ్రరూపం దాల్చవచ్చని హెచ్చరించారు. అందువల్ల ప్రజలు ఎలాంటి అపోహలు, భయాలు లేకుండా ముందుకు వచ్చి ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత హెచ్‌హెచ్ ఛాతీ ఎక్స్-రే పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీలేరు టిబి యూనిట్ పర్యవేక్షకులు మోహన్, పవన్ కుమార్, పీహెచ్‌ఎన్ కుసుమ, ఏఎన్ఎంలు భార్గవి, లక్ష్మి, సీహెచ్‌వోలు చంద్రకళ, నాగముత్యం, సౌజన్య, ఎక్స్-రే టెక్నీషియన్ రిహానా, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి సమీక్ష

**మదనపల్లె,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయడంపై మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి,మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి మాట్లాడుతూ శని,ఆదివారాలలో మదనపల్లె నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలు నింపించడం, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడం చేపడతామని తెలిపారు.అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించడమే ఈ ప్రత్యేక కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను గడువులోగా విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ప్రతినిధులు,ప్రజాప్రతినిధులు మరియు స్వచ్ఛంద సంస్థలు పూర్తి సహకారం అందించాలని ఆమె కోరారు.ప్రజలకు అవగాహన కల్పించి,అవసరమైన పత్రాలతో ఎన్యూమరేషన్ ఫారాలు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు జింకా చలపతి, వి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగకుండా,ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పారదర్శకంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను నిర్వహించాలని,ప్రజలకు అవసరమైన సహకారం అందించేందుకు పార్టీ తరఫున పూర్తిస్థాయిలో సహకరిస్తామని,క్షేత్ర స్థాయిలో ఎదురౌతున్న సమస్యలను గురించి సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం డిజిటైజేషన్ 60 శాతం చేయాల్సి ఉన్నందున స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గడువును జూలై 31 వరకు పొడిగించాలని వి.ఎస్ రెడ్డి మరియు జింకా చలపతి కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ బూత్ కమిటీ అధ్యక్షులు ఎన్.నవాజ్ అలీ ఖాన్ కూడా పాల్గొన్నారు.

## ‘విశ్వం’ అధ్యాపకుడు పూజారి అంజప్పకు డాక్టరేట్



**మదనపల్లె/ కురబలకోట,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విశ్వం ఇంజనీరింగ్ కళాశాల లోని ఈఈఈ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ (హెచ్.ఓ.డి)గా పనిచేస్తున్న పూజారి అంజప్పకు అరుదైన గౌరవం లభించింది. జేఎన్టీయు అనంతపురం నుండి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిరంతర కృషి, పట్టుదల, విద్యార్థుల పట్ల బాధ్యత, గురువుగా, విద్యాసంస్థపై నమ్మకం, భావితరాల కోసం టెక్నాలజీ అన్వేషణ, ఆధ్యాత్మిక కోణంలో అందరికీ పూజారిగా, గుడి ఆలయ ధర్మకర్తగా, ప్రజలందరికీ అందుబాటులో సహాయకుడిగా, సమాజ అభివృద్ధిలో పాలుపంచుకుంటూ కుటుంబ సభ్యులను, అందరి విద్యార్థులను ప్రోత్సహిస్తూ సమాజానికి ఒక వన్నెతెచ్చే వ్యక్తిగా పూజారి అంజప్ప గుర్తింపు తెచ్చుకున్నారని ప్రశంసించారు. పర్ఫామెన్స్ ఇంప్రూవ్మెంట్ అండ్ మేనేజ్మెంట్ ఆఫ్ పీవి హైబ్రిడ్ డిసి మైక్రో గ్రిడ్ సిస్టం అనే అంశంపై రాబోయే తరానికి,సమాజానికి కావలసిన టెక్నాలజీపై డాక్టరేట్ అవార్డు జేఎన్టీయూ అనంతపురం యూనివర్సిటీ ప్రదానం చేయడం శుభసూచకమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. విద్యారంగంలో తాను చేసిన కృషికి డాక్టరేట్ అవార్డుకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. తనకు అన్నివిధాలా సహకరిస్తున్న కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి, సహచర అధ్యాపకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. డాక్టరేట్‌కి ఎంపికైన పూజారి అంజప్పకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు కళాశాల యాజమాన్యం శుభాకాంక్షలు తెలియజేశారు.

## రెడ్డి సంక్షేమ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం

### - ఆర్.సి.డి.ఎస్ హాస్టల్ నిర్వహణ విధానాలపై సమీక్ష

**మదనపల్లె,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బెంగళూరు రోడ్డు లోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో సెక్రటరీ డాక్టర్ ఐ.అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది.శుక్రవారం జరిగిన సమావేశంలో ఆర్.సి.డి.ఎస్ వారు నిర్వహిస్తున్న హాస్టల్ విధి విధానాలు గురించి, అభివృద్ధిపైన చర్చించారు. అలాగే ఇంజనీరింగ్ కాలేజీ ఫైనల్ ఇయర్ పూర్తయిన కూడా ఫీజు రీయింబర్స్మెంట్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న కృష్ణారెడ్డి కుమారుడు ఫీజు బకాయిలను చెల్లించడానికి, పైచదువులకు ఇబ్బంది పడుతున్న పరిస్థితిని గుర్తించి కృష్ణారెడ్డి కుమారుడుకి ఆర్థిక సహాయం చేయడానికి అంగీకరించారు. భవిష్యత్తులో సంఘం తరపున సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడానికి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు టి.రామ చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు వి.సాంబశివారెడ్డి, ట్రెజరర్ గిరిధర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కె.సుధాకర్ రెడ్డి,న్యాయ సలహాదారులు శేషారెడ్డి,కో-ఆర్డినేటర్ ఎన్.సాంబశివారెడ్డి, కమిటీ సభ్యులు శేషాద్రి రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సుబ్బారెడ్డి, రంగారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మస్తాన్ రెడ్డి,రామలింగారెడ్డి, మాధవరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి,సీడ్స్ రామకృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, ఆర్.సి.డి.ఎస్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పద్మప్రియా రెడ్డిలు పాల్గొన్నారు.

## బి.కె పల్లెలో ప్రభుత్వ భూములు ఆక్రమణ

### - చర్యలు తీసుకోవాలంటూ బివైఎస్ డిమాండ్ - తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు



**మదనపల్లె, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లి మండలం,బీకే పల్లి గ్రామం,సర్వే నెంబర్ 443లోని విలువైన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి,అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారని బహుజన యువసేన (బీవైఎస్) అధ్యక్షులు పునీత్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన తరపున సీనియర్ అధికారి డీటీ నారాయణస్వామికి శుక్రవారం బహుజన యువసేన ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ బీకే పల్లిలోని సర్వే నెంబర్ 553లో ఉన్న జగనన్న కాలనీకి ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 443 ప్రభుత్వ భూమిని కొందరు స్వార్థపరులు ఆక్రమిస్తున్నారని తెలిపారు. అక్కడ రాళ్లు వేసి సరిహద్దులు ఏర్పాటు చేయడమే కాకుండా తప్పుడు పత్రాలతో అమాయక ప్రజలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. దీనికి సంబంధించిన జియో-ట్యాగ్డ్ ఫోటోలను, ఆధారాలను అధికారులకు అందజేశారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి ఆక్రమణదారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమిని కాపాడి అమాయకులు మోసపోకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు పాల్గొన్నారు.

## పంటను నేరుగా కొనుగోలు చేస్తాం: రమణ

**రామసముద్రం,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఎఫ్‌పీఓల ద్వారా కంపెనీలతో అనుసంధానం చేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఎఫ్‌పీఓఎస్ కోఆర్డినేటర్ రమణ తెలిపారు. రామసముద్రం రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయాన్ని చెన్నైకి చెందిన ఆదిరైయన్ ఆగ్రో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రామ్మోహన్, రాజ్‌కుమార్, రవికుమార్ శుక్రవారం సందర్శించారు. అనంతరం రైతుల పొలాలను పరిశీలించి, పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసి గిట్టుబాటు ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రామసముద్రం, పెద్దతిప్పసముద్రం, మొలకలచెరువు, పెద్దమండ్యం, బి.కొత్తకోట, గాలివీడు మండలాల రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా కంపెనీతో ఒప్పందం కుదిరిందని రమణ తెలిపారు. మొక్కజొన్న, రాగి, శనగ, బొప్పాయి, ఖర్బూజ, చింతపండు, క్యారెట్, బీట్‌రూట్ తదితర పంటలను ఎగుమతి చేసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో రామసముద్రం సీఈవో ప్రియాంక, ఎఫ్‌పీఓ సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు నియామక పత్రాల పంపిణీ

**ఉరవకొండ,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఐదు మండలాల నుండి ఎంపికైన 23 మంది అంగన్‌వాడీ ఆయాలలో 19 మందికి రాష్ట్ర గౌరవ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉప్రణాళిక, వాణిజ్య పనులు మరియు శాసన సభ వ్యవహారల శాఖ మంత్రి వర్యులు శ్రీ పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసిన కుక్కర్లను కూడా మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నూతనంగా నియమితులైన ఆయాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు,బాలింతలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ సాజిదా గారు, ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ డాక్టర్ బి. ఎన్. శ్రీదేవి గారు, సూపర్‌వైజర్లు అరుణ గారు, ధనశేఖర్ గారు, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## మల్లయ్యకొండలో ఖనిజ తవ్వకాలపై టీడీపీ, వైసీపీ దొందూ దొందే!

### - రాజకీయ లబ్ధి కోసం ప్రజలను మభ్యపెడుతున్న ఇరు పార్టీలు
### - కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ ఆగ్రహం
### - సీపిఐ కార్యదర్శి కె.మురళితో కలిసి మల్లయ్యకొండ సందర్శన



**మదనపల్లె,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన తంబళ్లపల్లె నియోజకవర్గం, మల్లయ్యకొండలో అపారమైన ఖనిజ సంపద దాగి వుందనేది జగమెరిగిన సత్యం. ఖనిజ సంపద దోచుకోవడానికి గత వైసీపీ ప్రభుత్వ హయంలో టెండర్లు పిలిస్తే పోరాటం చేసిన టీడీపీ, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ టెండర్లు పిలవడం ప్రారంభించారు. ఈ దశలో ప్రజా వ్యతిరేకత వ్యక్తం కావడంతో రాజకీయ లబ్ధి కోసం ఇరుపార్టీలు పోటాపోటీగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, గిరిప్రదక్షణలు, పత్రికా సమావేశాలు పెట్టడం విడ్డూరంగా వుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ విమర్శలు గుప్పించారు.శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లయ్యకొండ మైనింగ్ ప్రాంతాన్ని సందరర్శించి, స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ మాటమీద నిలవని వైసీపీ, టీడీపీ వైఖరిపై విమర్శలు గుప్పించారు.ఇనుము కొండ,సాదు కొండలలో ఉన్న ఖనిజాలను దోచుకోవడానికి మైనింగ్ టెండర్లను పిలిచింది మీరంటే మీరని ఒకరిపై మరోకరు ఆరోపణలు చేసుకోవడం,అంతిమంగా రాజకీయ లబ్ధి కోసమేనన్నారు. స్థానిక ప్రజలు, భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఇలాంటి చర్యలు, నైతిక విలువలకు తిలోదకాలు ఇవ్వడమేనన్నారు. ఒకపక్క వైసీపీ నాయకులు మైనింగును అడ్డుకుంటామని తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు గ్రామాలలో తిరుగుతున్నారు. ఇంకోవైపు టిడిపి నాయకులు ప్రెస్ మీట్లు ఏర్పాటు చేసి ప్రజల,భక్తుల మనోభావాలకు సెంటిమెంట్లకు ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నారన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు మైనింగ్‌ను అడ్డుకుంటుంటే కొండల్లోకి వెళ్లి మైనింగ్ చేస్తున్నది ఎవరని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2024 జనవరిలో ఆర్కే ఎర్త్ రిసోర్స్ సంస్థకు ఇనుము కొండ మైనింగ్ టెండర్ కేటాయించారని పత్రికలలో వచ్చిందని, అదేవిధంగా ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలో ఏప్రిల్ 23,2026 తేదీన మైనింగ్ లీజుకి ఇవ్వడానికి ఈ యాక్షన్ ఉత్తర్వులను ఇవ్వడం జరిగిందని వివరించారు. ఇరువురు మైనింగ్ కోసం తాపత్రయం చూపడం వెనుక దోచుకోవడమేనన్నారు. భక్తులు, స్థానిక ప్రజలు, పర్యావరణ వేత్తలు మైనింగ్ కు వ్యతిరేకంగా గళం విప్పితే అధికార, ప్రతిపక్షాలు ఒకరి మీద ఒకరు నిందలు చేసుకోవడం ప్రజలు గమనిస్తున్నారని గుర్తు చేశారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల కాలంలో మల్లయ్య కొండపై శ్రీమల్లికార్జున స్వామి దేవాలయం అభివృద్ధి చెందిందన్నారు. దాదాపు 7 వేల హెక్టార్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యావరణవేత్తలు అభ్యంత రాలు ఉన్నప్పటికీ మైనింగ్‌కు పూనుకోవడం తగదని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం, వైసీపీ శాశ్వతంగా మల్లయ్యకొండలో మైనింగ్ స్వస్తి పలకాలని లేనిపక్షంలో ప్రజా వ్యతిరేకతలో కొట్టుకుపోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి పి.ముబారక్ ఖాన్, నాగరాజు, అన్నమయ్య జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బి.శరత్ కుమార్ రెడ్డి,నిమ్మనపల్లి మండల బీసీ సెల్ మాజీ అధ్యక్షులు ఆర్.నాగరాజ, మదనపల్లి టౌన్ మాజీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీలు పాల్గొన్నారు.

## దేశానికి వచ్చిన మొదటి క్రైస్తవుడు తోమా

**కడప,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారత దేశానికి క్రీస్తు సువార్తను తీసుకొచ్చిన మొదటి క్రైస్తవుడు అపోస్తులుడైన తోమా అని జీసస్ క్రైస్ట్ కెథడ్రల్ చర్చి బిషప్ డా కె శామ్యూల్ బాబు అన్నారు. భారత క్రైస్తవ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శామ్యూల్ బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన చర వాణి ద్వారా మీడియాతో మాట్లాడారు. సరిగ్గా నేటితో మా 52వ శతాబ్దంలో దేశంలోని కేరళ రాష్ట్రంలోని మలబార్‌కు చేరుకుని అక్కడ క్రీస్తు సువార్తను నిర్భయం గా ప్రకటించి అనేక మందిరాలను కట్టించి, అనేక మంది బ్రాహ్మణులను క్రైస్తవ మతంలోకి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. ఈయన ఏసుక్రీస్తు శిష్యుల్లో ఒకరని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం జూలై 3న భారత క్రైస్తవ దినోత్స వాన్ని ఘనంగా జరుపుకుంటున్నారని చెప్పారు.72వ శతాబ్దంలో తమిళనాడుకు చేరుకొని అక్కడ సువార్త ప్రకటిస్తూ క్రీస్తు కొరకు హత సాక్షి అయ్యాడని, ఆ ప్రాంతం ఇప్పుడు పరిశుద్ధ థామస్ మౌంట్ అని పిలువబడుతోందని చెప్పారు.

## అచ్చ తెలుగు కవివర్య ‘నాగనార్య’



**కడప, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అచ్చ తెలుగు కావ్యాలు, పురాణాలు, చారిత్రక కావ్యాలు, శతకాలు, దండకాలు రచించిన నారు నాగనార్య అచ్చ తెలుగు కవివర్య అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం శుక్రవారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నారు నాగనార్య 124వ జయంతిని నిర్వహించిం ది. అనంతరం డా చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ నాగనార్య అసలు పేరు నాగ య్య అని, ఆయన ప్రసిద్ధకవులు జనమంచి శేషాద్రిశర్మ, వేదం వేంకటకృష్ణ శర్మల శిష్యుడని అన్నారు. అన్ని కవితా ప్రక్రియల్లో రచనలు చేసిన నారు నాగయ్యకు జనమంచి సుబ్రహ్మణ్యశర్మ ‘ఆర్య’ అనే బిరుదునిచ్చి నాగనార్యగా మార్చారని అన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది సుమతి, శ్రీను, రాణి, అరుణ పాఠకులు సూర్యబాబు, సుబ్బారెడ్డి, శ్రీనాథ్, వరుణ్ నాయక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూపై చైతన్య ర్యాలీ



**పీలేరు,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా “ఫ్రైడే డ్రై డే” కార్యక్రమాన్ని పీలేరు మండలం కోళ్లపారం కాలనీతో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, కలరా వంటి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు ఎక్కడ, ఎలా వృద్ధి చెందుతాయి, వాటి జీవన దశలు, ఏ సమయంలో కుడతాయి, ఏ దోమ వల్ల ఏ వ్యాధి వస్తుందనే అంశాలను లార్వాలను ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు. ఇళ్లలో, పరిసరాల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సూచిస్తూ నీటి తొట్లు, డ్రమ్ములను ఖాళీ చేయించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలోని సుమారు 480 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల నివారణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ జ్వరాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించి, విద్యార్థులతో “మన ఆరోగ్యం మన చేతిలో”, “మన పంతం-దోమల అంతం” వంటి నినాదాలు చేయించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కోఆర్డినేటర్ అధికారి పద్మజ హాజరై విద్యార్థుల ఆరోగ్యం, విద్యా సౌకర్యాలు, వసతి, తరగతి గదులు, వంటశాల పరిస్థితులను తెలుసుకుని, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకళ, స్టాఫ్ నర్స్ ప్రమీల, ఆరోగ్య కార్యకర్తలు శివప్రసాద్, మనోహర్, వెంకటరమణ, చిన్నరెడ్డప్ప, వెంకటరత్నం, అయేషా, ఆశ, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపాలి

## –ప్రముఖ న్యాయవాది జి. శ్రీధర్ రెడ్డి



**కర్నూల్ జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కర్నూలు పట్టణంలోని శ్రీ సాయినాథ్ నగర్ లో ఉన్న ఓరియన్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన కర్నూల్ జిల్లా స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీల ప్రారంభోత్సవానికి ప్రత్యేక అతిథిగా ప్రముఖ న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రీడల్లో రాణించడం వలన విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని నిత్యం క్రీడలు సాధన చేయడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధమేనని తెలిపారు.



ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతిరావు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ షూటింగ్ బాల్ క్రీడను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారు గుర్తించారని , ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహ్వానిత అతిథి ఓరియన్ పాఠశాల కరస్పాండెంట్ వెంకటరమణ క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ తమ విద్యాసంస్థ లో చదువుతోపాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు , జిల్లా కార్యదర్శి నాగరాజు , సభ్యులు ప్రకాష్ , మధుసూదన్ , కిరణ్ కుమార్ , సురేష్, ఉపేంద్ర తోపాటు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పాప బాయ్, సులోచన , నాగేశ్వరి , సుమలత, క్రీడాకారులు ఈ ఎంపిక పోటీలలో 12 బాలుర జట్లు , 9 బాలికల జట్లు పాల్గొన్నట్లు తెలిపారు.

# వర్క్ ఫ్రమ్ హోమ్ ఆశ చూపి యువకుడికి రూ.2 లక్షల నామం!



**విజయవాడ జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడి ఓ యువకుడు భారీగా నగదు పోగొట్టుకున్న సంఘటన కంచికచర్ల మండలంలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఘని అత్కూరు గ్రామానికి చెందిన వేంపరాల త్రి సాయి (26) అనే యువకుడు వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు.దీన్ని ఆసరాగా చేసుకున్న గుర్తుతెలియని కేటుగాళ్లు వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌ల ద్వారా బాధితుడిని సంప్రదించారు. పార్ట్ టైమ్ జాబ్, అధిక లాభాలంటూ నమ్మించి విడతల వారీగా అతని బ్యాంక్ ఖాతా నుండి రూ.2 లక్షలు కాజేశారు. డ్రా చేసిన అనంతరం సదరు వ్యక్తులు స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన త్రి సాయి కంచికచర్ల పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు పంపే లింకులు, ఆన్‌లైన్ ఉద్యోగ ప్రకటనలను నమ్మి డబ్బులు చెల్లించవద్దని, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఇన్‌స్టాగ్రామ్ పరిచయం: బాలికపై యువకుడి అత్యాచారం, ఐదు నెలల గర్భవతి!




**విజయవాడ జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇన్‌స్టాగ్రామ్ పరిచయం ఒక బాలిక జీవితాన్ని ఛిద్రం చేసింది. పెళ్లి పేరుతో నమ్మించి ఓ యువకుడు బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పోలీసుల కథనం ప్రకారం... విజయవాడకు చెందిన ఒక బాలికకు, సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన అశోక్ అనే వ్యక్తితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. తాను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అశోక్, సదరు బాలికను కోదాడకు పిలిపించుకున్నాడు. అక్కడ ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు.ఇటీవల ఆ బాలిక తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా, బాలిక 5 నెలల గర్భవతి అని తేలడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. బాధితురాలిని అడగ్గా అసలు విషయం బయటపెట్టింది. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలి కుటుంబ సభ్యులు విజయవాడ పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు అశోక్‌పై పోక్సో (గూజూా) చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# ఆధ్యాత్మిక వైభవానికి మంగినపూడి వేదిక

**63 అడుగుల సహజ మట్టి గణేశ విగ్రహం, ఉపాలయాల నిర్మాణానికి శంకుస్థాపన**

**మచిలీపట్నాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి**



**మచిలీపట్నం జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో రానున్న శ్రీ గణేశ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయనున్న 63 అడుగుల ఎత్తైన సహజ మట్టి శ్రీ గణేశ మహారాజ్ విగ్రహంతో పాటు పలు ఉపాలయాల నిర్మాణానికి శుక్రవారం ఉదయం రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపన చేశారు. అనంతరం ఉత్సవాలకు అవసరమైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు బోర్‌వెల్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మచిలీపట్నం గత వైభవాన్ని పునరుద్ధరించడంతో పాటు బందరును రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ తీర ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మంగినపూడి బీచ్ అభివృద్ధితో మచిలీపట్నం అమరావతి గేట్‌వేగా రూపుదిద్దుకోనున్నదని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ప్రారంభం కానున్న పోర్టు నిర్మాణం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా సాగాలని విఘ్నేశ్వరుని ఆశీస్సులు కోరారు. 63 అడుగుల సహజ మట్టి గణేశ విగ్రహంతో పాటు పలు ఉపాలయాల ఏర్పాటుతో ఈ ఏడాది గణేశ నవరాత్రి ఉత్సవాలను రాష్ట్రంలోనే ప్రత్యేక ఆకర్షణగా, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, టౌన్ పార్టీ అధ్యక్షుడు లోగిశెట్టి స్వామి, మాజీ ఎంపీపీ, రూరల్ పార్టీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, జనసేన పార్టీ అధ్యక్షుడు గడ్డం రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పల్లపాటి సుబ్రమణ్యం, అక్కుమంతి రాజా, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మచిలీపట్నం పోలీస్ స్టేషన్ లో యూట్యూబర్ ప్రశ్న రావణ్

**భారీ పోలీసు భద్రత.... న్యాయస్థానం ముందు హాజరు.**




**మచిలీపట్నం జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తెలంగాణకు చెందిన యూట్యూబర్ ప్రశ్న రావణ్‌ను మచిలీపట్నం పోలీసులు అదుపులోకి తీసుకుని ఇనుకుదురుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై జనసేన కార్యకర్తలు పలు ప్రాంతాల్లో చేసిన ఫిర్యాదుల మేరకు నమోదైన కేసుల నేపథ్యంలో ఈ చర్య చేపట్టారు. ఇప్పటికే ఇదే కేసుకు సంబంధించి హైదరాబాద్ నుంచి పిఠాపురానికి తరలించిన పోలీసు అధికారులు ఆయనను కోర్టులో హాజరుపరచగా బెయిల్ మంజూరైంది. అనంతరం మచిలీపట్నం ఇనుకుదురుపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసు విచారణ కోసం స్థానిక పోలీసులు రావణ్‌ను మచిలీపట్నానికి తీసుకువచ్చారు. రావణ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న విషయం తెలిసిన జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రావణ్‌పై దాడి జరిగే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసులు ఆయనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. పోలీస్ స్టేషన్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసి, భారీ బందోబస్తు నిర్వహించారు ఈ సందర్భంగా కొందరు కార్యకర్తలు పోలీసుల ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను దాటి రావణ్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. మరికొందరు పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడ దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మచిలీపట్నం ఇనుకుదురుపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ప్రశ్న రావణ్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ పరీక్షలు నిర్వహించారు. న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. ఈ ఘటనతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా చిలకలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ నబి, ఇనకుదురు పేట పరమేశ్వర రావు, భారీ బందోబస్తు ఏర్పాటు చేసి కోర్టుకు హాజరు పరచడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


# ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు.. మహిళకు తీవ్ర గాయాలు



**మచిలీపట్నం జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం బైపాస్ రోడ్డులోని గాయత్రి స్కూల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి తీవ్రంగా గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు ఘటన అనంతరం అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు వాహనాన్ని అడ్డుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# కరెంట్ షాట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం.

**ఆర్టీసీ కాలనీలో అగ్నిప్రమాదం.. షార్ట్ సర్క్యూట్‌తో రెండు విద్యుత్ మీటర్లు దగ్ధం.**



**మచిలీపట్నం జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలోని 8వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. లింగం రేష్మ నివాసంలో విద్యుత్ మీటర్ల వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు తెలుస్తుంది మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు భయాందోళన గురయ్యారు వెంటనే విద్యుత్ శాఖ అధికారులు, అగ్నిమాపక మరియు విపత్తుల నిర్వహణ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో రెండు విద్యుత్ మీటర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

# ఈ నెల 30 న ఛలో కలెక్టరేట్ కార్యక్రమం




**భీమునిపట్నం జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాల పెంపునకు ఐక్య పోరాటాలే శరణ్యమని సి ఐ టి యు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి కార్మికులకు పిలుపునిచ్చారు చిట్టి వలస సి జె ఎం కళ్యాణ మండపం లో శుక్రవారం వివిధ రంగాల కార్మికుల తో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ, ప్రతి ఐదేళ్లకో సారి పెరగాల్సిన వేతనాలను దాదాపు 15 ఏళ్లుగా ప్రభుత్వాలు పెంచడం లేదన్నారు నిత్యా వసర వస్తువుల ధరలు ఓ వైపు విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో కార్మిక కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు పెరుగుతున్న ధరలకు, కార్మికులకు ఇస్తున్న వేతనాలకు ఎక్కడా పొంతన లేదన్నారు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్న డిమాండ్ తో ఈ నెల 30 న ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టామన్నారు. 31 న ఆశ, అంగన్వాడీ, ఇతర స్కీమ్ వర్కర్ల తో ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు ఈ సమావేశం లో సి ఐ టి యు జోన్ కార్యదర్శి ఎస్ అప్పల నాయుడు, యూనియన్ మండల అధ్యక్షులు నీలాతి రాము, కమిటీ సభ్యులు ముద్దాడ రాము, వి నాగరాజు, నాయకులు పంపాన సూర్య నారాయణ, పల్లా పెంట రాజు, దువ్వి నరసింగరావు, నమ్మి నాయుడు, జి వి ఎం సి ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ భీమిలి జోన్ నాయకులు రాజేష్, రామారావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అన్న పూర్ణ, ఆదిలక్ష్మి తది తరులు పాల్గొన్నారు

# ఓటరు సవరణ ప్రక్రియను పక్కగా నిర్వహించాలి



**గుంటూరు జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను పక్కగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి సూచించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సర్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యక్షంగా లేనివారు(ఆబ్సెంట్), ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు (షిఫ్టెడ్), మరణించినవారు (డెడ్), డూప్లికేట్, ఇతర దేశస్థులు క్రింద ఉన్న ఓటర్లు మినహా అందరూ ఓటరు జాబితాలో ఉంటారని చెప్పారు. సర్ ప్రక్రియపై ఎటువంటి అపోహలు అవసరం లేదన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఫారం 6 సమర్పించవచ్చని, తొలగింపులకు ఫారం 7, సవరణలకు ఫారం 8 సమర్పించవచ్చని వివరించారు. ఫారాలను బిఎల్వోలకు అందించాలని కోరారు. ఓటరుగా ఆన్ లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఈసీఐ నెట్ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆ యాప్‌లో ఓటరు నమోదు, వివరాలకు సంబంధించి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. భాజపా మార్కాపురం జిల్లా ఇంఛార్జిగా గుంటూరు జిల్లా నేత కొక్కెర శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మార్కాపురం జిల్లాలో భాజపా బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఆయా జిల్లాలో ప్రజా ప్రతినిధులను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రాధాన్యం: ఎమ్మెల్యే




**చింతలపూడి జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** . ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత అని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. వారి సమస్యలు విన్న ఎమ్మెల్యే.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, సత్వర పరిష్కారం చూపడం తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


# సత్వరమే ప్రజా సమస్యలకు పరిష్కారం: ఎమ్మెల్యే



**విజయనగరం జూలై 3 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను అధికారులు, ఉద్యోగులు తీసుకోవాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సత్వరమే ప్రజా సమస్యలకు పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఉద్యోగులు, ప్రజలు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు.




# టాలీవుడ్ థియేటర్ల దగ్గర ఏంటి పరిస్థితి






టాలీవుడ్ లో జూన్ నెలలో పెద్ది, మా ఇంటి బంగారం తమ మీద పెట్టుకున్న ఆశలు నెరవేర్చాయి. తెలుగు రాష్ట్రాల వరకు చూసుకుంటే రామ్ చరణ్ అధిక శాతం ఏరియాల్లో లాభాలు ఇవ్వగా, సమంత ఏకంగా డబుల్ ప్రాఫిట్స్ తో అందరినీ ఖుషి చేసింది. గత వారం రావాల్సిన లెనిన్ వాయిదా పడటంతో ఆ స్లాట్ వృథాగా అయిపోయింది. ఈ రోజు రెండు కొత్త రిలీజులు సందడి చేశాయి. హైదరాబాద్ లో నిన్న రాత్రే ప్రీమియర్లు వేయడంతో జనాల కోలాహలం కనిపించింది. ఇక రెస్పాన్స్ విషయానికి వస్తే నాగబంధం జానర్ అడ్వాంటేజ్ తీసుకుంది. కంటెంట్ ఎలా ఉందనేది పక్కనపెడితే ట్రైలర్ లో చూపించిన విజువల్స్, దేవుళ్ళకు సంబంధించిన రెఫరెన్సు వగైరాలు ఆడియన్స్ ని టికెట్లు బుక్ చేసుకోవడానికి టెంప్ట్ చేశాయి. మెయిన్ సెంటర్స్ లో డీసెంట్ ఆక్యుపెన్సీలు కనిపించాయి. సత్యదేవ్ రావు బహదూర్ కు మూవీ లవర్స్ మద్దతు దొరికి దర్శకుడు వెంకటేష్ మహా మీద నమ్మకంతో థియేటర్లకు జనాన్ని వచ్చేలా చేసుకుంది. స్క్రీన్ ప్లే కొంచెం నెమ్మదిగా ఉండటంతో పాటు డిఫరెంట్ కాన్సెప్ట్ ఎంచుకోవడంతో రావు బహదూర్ కమర్షియల్ గా ఏ స్థాయికి వెళ్తుందనేది వీకెండ్ అయ్యాక క్లారిటీ వస్తుంది. బాలీవుడ్ మూవీ అల్ఫాకి యునానిమస్ గా నెగటివ్ టాక్ రావడం అప్పుడే ప్రభావం చూపిస్తోంది. స్టార్ హీరో సినిమాలు లేకపోవడంతో థియేటర్ల దగ్గర భారీ సందడి అయితే లేదు. వారాంతంలో ఏ మేరకు పుంజుకుంటాయనే దాని మీద ఫైనల్ స్టేటస్ ఆధారపడి ఉంది. వచ్చే వారం లెనిన్ రానున్న నేపథ్యంలో నాగబంధం, రావు బహదూర్ కు రాబోయే ఆరు రోజులు చాలా కీలకం కాబోతున్నాయి. కాకపోతే మాస్ ఎలిమెంట్స్ తక్కువగా ఉండే వీటికి ఎలాంటి మద్దతు దక్కుతుందనేది వేచి చూడాలి. వేసవి సెలవులు అయిపోయి స్కూళ్ళు కాలేజీలు తెరుచుకోవడం కొంత ఎఫెక్ట్ చూపిస్తున్న మాట వాస్తవమే. అయితే దాన్ని దాటుకుని మరీ పెద్ది, మా ఇంటి బంగారం థియేటర్స్ ని ఫుల్ చేశాయి. మరి రావు బహదూర్, నాగబంధం దాన్ని కొనసాగిస్తాయేమో వెయిట్ అండ్ సీ.

## అలియా భట్ సినిమాకి ఇంత నెగిటివిటీనా



బాలీవుడ్ మూవీ అల్ఫా ఇవాళ విడుదలైన సంగతి తెలిసిందే. అలియా భట్ టైటిల్ రోల్ పోషించగా శార్వరి వాఘ్ మరో కీలకమైన పాత్రలో కనిపించింది. దురంధర్ తర్వాత ఇలాంటి స్పై సినిమాలను ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే అనుమానం ఉత్తరాది వర్గాల్లో బలంగా ఉంది. ఆ భయమే నిజమయ్యింది. అల్ఫా మీద మీడియాలో విపరీతమైన నెగటివిటీ కనిపిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియా ఫేమస్ హ్యాండిల్స్ ఒకటి నుంచి రెండు లోపలే రివ్యూ రేటింగ్స్ ఇచ్చాయి. ఎందుకిలా జరిగిందో చూద్దాం. ఆల్ఫా కథ ఎన్నోసార్లు అరిగిపోయిన స్పై డ్రామా టెంప్లేట్ లోనే సాగుతుంది. సీత (అలియా భట్) అనే చిన్నపిల్లని కల్నల్ లఖావత్ అలియాస్ బాబా (బాబీ డియోల్) పసితనం నుంచే క్రూరమైన ఫైటర్ గా శిక్షణ ఇస్తాడు. ఆమె పెరిగి పెద్దయ్యాక దేశద్రోహిగా మారిన కల్నల్ మీద సీత ఎదురు తిరిగే పరిస్థితి వస్తుంది. అదే సమయంలో మరో ఏజెంట్ (శార్వరి)తో చేతులు కలుపుతుంది. ఈ ఇద్దరూ కలిసి బాబాని ఎలా అడ్డుకున్నారనేదే స్టోరీ. యష్ రాజ్ ఫిలిమ్స్ అధినేత కం కథా రచయిత ఆదిత్య చోప్రా తన రెగ్యులర్ పంథాలోనే అల్ఫా రాసుకున్నారు. దర్శకుడు శివ్ రవైల్ దాన్నే గుడ్డిగా ఫాలో అయిపోయారు. ఫిజిక్స్ ని ఛాలెంజ్ చేసే ఫైట్లు, ఎమోషన్లు లేకుండా యాక్షన్ ఎపిసోడ్లు, పాకిస్థాన్ ప్రస్తావన బలవంతంగా ఇరికించి రాసే విలన్ బ్యాక్ డ్రాప్ ఇవన్నీ ఇందులోనూ ఉన్నాయి. టైగర్ 3, వార్ 2 దారుణంగా ఫెయిలయ్యాక కూడా మళ్ళీ అదే రూట్ లో ఈ ఫిమేల్ ఓరియెంటెడ్ మూవీ తీయడం విచిత్రం. అల్ఫాతో యష్ రాజ్ స్పై యూనివర్స్ కి బ్రేక్ పడుతుందనే ప్రచారం జోరుగా జరుగుతోంది. కంటెంట్ ఎంత వీక్ గా ఉందంటే పేలిపోవాల్సిన హృతిక్ రోషన్ క్యామియో సైతం ఫోర్స్డ్ గా డల్లుగా అనిపించింది. రెండున్నర గంటల పాటు వావ్ అనిపించే అవకాశమే ఇవ్వకుండా అల్ఫా మన ఓపికకు పెద్ద పరీక్ష పెడుతుంది. రెండేళ్లు గ్యాప్ తీసుకున్న అలియా భట్ కు సరైన కంబ్యాక్ ఇచ్చే అవకాశం అల్ఫా ఇవ్వలేదు. దీని దెబ్బకు టైగర్ వర్సెస్ పఠాన్, టైగర్ 4, వార్ 3 అసలు ఉంటాయో లేదో.

# లెనిన్ భాగ్యశ్రీకే రాసిపెట్టి ఉంది




ఒక పాత్రకు ఒక ఆర్టిస్టు ఎంపికై.. ఆ తర్వాత ఇంకొకరి చేతికి మారడం ఫిలిం ఇండస్ట్రీలో మామూలే. చాలాసార్లు చిత్రీకరణకు ముందే ఈ మార్పు జరుగుతుంటుంది. చాలా కొన్ని సందర్భాల్లో మాత్రమే షూటింగ్ కూడా చేశాక ఆర్టిస్టులను మార్చేస్తుంటారు. అఖిల్ అక్కినేని హీరోగా తెరకెక్కిన ‘లెనిన్’లో ఈ రెండో రకమైన మార్పే జరిగింది. ఈ చిత్రానికి కథానాయికగా శ్రీలీలను అధికారికంగా ప్రకటించడం.. ఆమె చిత్రీకరణకు కూడా హాజరు కావడం తెలిసిందే. కానీ అనూహ్యంగా తన స్థానంలోకి భాగ్యశ్రీ బోర్సే వచ్చింది. దీనికి కారణాలేంటన్నది వెల్లడి కాలేదు. ఐతే ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే.. ముందు ఇందులో కథానాయిక పాత్ర భాగ్యశ్రీ దగ్గరికే వెళ్లిందట. కానీ ఏవో కారణాలతో ఆమె ఈ సినిమా ఒప్పుకోలేకపోయిందట. తర్వాత అనుకోకుండా మళ్లీ ఆ పాత్రకు తనే ఎంపికయ్యానని ఆమె మా ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది మొదట దర్శకుడు మురళీ కిషోర్ ‘లెనిన్’ కథ, అందులో భారతి పాత్ర గురించి చెప్పినపుడు తాను ఎంతో ఎగ్జైట్ అయినట్లు భాగ్యశ్రీ చెప్పింది. భారతి పాత్ర చాలా ప్రత్యేకంగా కనిపించిందని.. ప్రేమకథ చాలా సహజంగా అనిపించిందని. ఎపిక్ లవ్ స్టోరీస్‌లో ఉన్న లక్షణాలు ఇందులో ఉన్నాయని ఆమె చెప్పింది. ఐతే ఈ పాత్ర విషయంలో తాను ఎంతో ఎగ్జైట్ అయినప్పటికీ.. డేట్లు, ఇతర కారణాలతో ఈ సినిమాను వదులుకోవాల్సి వచ్చిందని.. కానీ తర్వాత మళ్లీ అనుకోకుండా ఈ సినిమా తన చేతికి వచ్చిందని ఆమె చెప్పింది. మొత్తానికి ఒకసారి భాగ్యశ్రీని కాదనుకుని, శ్రీలీలను ఎంపిక చేశాక కూడా ఆమెను తప్పించి తిరిగి భాగ్యశ్రీనే ఈ పాత్రకు సెలక్ట్ చేశారంటే బలమైన కారణమే ఉందనుకోవాలి. ఈ మార్పు వల్ల ‘లెనిన్’ టీంకు డబ్బులతో పాటు సమయం కూడా వృథా అయింది. అయినా హీరోయిన్ని మార్చారంటే శ్రీలీల ఈ పాత్రకు సూట్ కాదని, దానికి భాగ్యశ్రీనే కరెక్ట్ అని టీం ఎంత బలంగా ఫిక్సయిందో అర్థం చేసుకోవచ్చు.



# బిజినెస్ న్యూస్



## టీ, హెల్త్ స్టాక్స్‌లో కొనుగోళ్లు.. మూడో రోజూ లాభాల్లోనే



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని లాభాలతో ముగించాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. ఐటీ, రియాల్టీ, ఫార్మా, హెల్త్‌కేర్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 78,152.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,502.12) లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో 600 పాయింట్ల మేర లాభాల్లో కదలాడిన సెన్సెక్స్.. మధ్యాహ్నం తర్వాత కాస్త క్షీణించింది. చివరికి 261.79 పాయింట్ల లాభంతో 77,763.91 వద్ద ముగిసింది. నిఫ్టీ 95.15 పాయింట్ల లాభంతో 24,270.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4179 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## పబ్లిక్ ఇష్యూకు రత్నదీప్ సూపర్‌మార్కెట్స్




హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆహార, నిత్యావసరాల రిటెయిల్ సంస్థ రత్నదీప్ రిటెయిల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.400 కోట్లు సమీకరించే లక్ష్యంతో తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఐపీఓలో తాజా షేర్ల జారీతో పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) ద్వారా ప్రమోటర్లు సందీప్ అగర్వాల్, మనీశ్ భార్తియా, మితేశ్ భార్తియా, యాస్ అగర్వాల్, కవితా అగర్వాల్ తమ వాటా షేర్లలో కొంతమేర (1.49 కోట్ల షేర్లు) విక్రయించనున్నారు. ఐపీఓకు ముందే (ప్రి- ఐపీఓ) రూ.70 కోట్ల విలువైన షేర్లను కంపెనీ జారీ చేసే అవకాశం ఉంది. ఇందులో షేర్లకు పూర్తి స్థాయిలో స్పందన లభిస్తే... ఐపీఓలో తాజా షేర్ల పరిమాణం తగ్గుతుంది. నిధుల వినియోగం: సమీకరించే నిధుల్లో రూ.260 కోట్లను రత్నదీప్, నేషనల్ మార్ట్ పేరుపై కొత్త విక్రయ కేంద్రాలు తెరిచేందుకు; రూ.40 కోట్లను రుణాల చెల్లింపునకు, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఉపయోగించనుంది. కార్యకలాపాలు.. ఆదాయాలు: 2026 మార్చి 31 నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో రత్నదీప్‌కు మొత్తం 190 విక్రయ కేంద్రాలున్నాయి. రత్నదీప్ (సూపర్ మార్కెట్లు), రత్నదీప్ సెలెక్ట్ (ప్రీమియం ఫుడ్ స్టోర్లు), నేషనల్ మార్ట్ (హైపర్ మార్కెట్), స్టైల్ మార్ట్ (అందుబాటు ధరల్లో దుస్తుల కోసం) పేర్లతో వీటిని నిర్వహిస్తోంది. 2025-26లో రూ.2,223 కోట్ల ఆదాయంపై రూ.36 కోట్ల లాభం ఆర్జించినట్లు రత్నదీప్ రిటెయిల్ తెలిపింది. పోటీ సంస్థలు: రత్నదీప్ పోటీ సంస్థలైన అవెన్యూ సూపర్‌మార్ట్స్ (డి-మార్ట్), విశాల్ మెగా మార్ట్, స్పెన్సర్ రిటెయిల్, ట్రెంట్ ఇప్పటికే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి.

## లాంచ్‌కు ముందే అమ్ముడైపోయాయ్!: ధర ఎంతంటే?




ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ‘కొడియాక్ ఆర్‌ఎస్’ కారును స్కోడా ఆటో ఇండియా దేశీయ విఫణిలో లాంచ్ చేసింది. దీని ధర రూ. 66.99 లక్షలు (ఎక్స్-షోరూమ్). అయితే కంపెనీ దీనిని సీబీయూ (కంప్లీట్ బిల్ట్ యూనిట్) ద్వారా దిగుమతి చేసుకుంటుంది స్కోడా లాంచ్ చేసిన ఈ కొత్త కొడియాక్ ఆర్‌ఎస్ కారు కోసం కంపెనీ బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించిన తరువాత.. ఆరు నిమిషాల వ్యవధిలోనే అన్నీ అమ్ముడైపోయాయి. దీన్నిబట్టి చూస్తే ఇండియన్ మార్కెట్లో దీనికున్న డిమాండ్ ఏంటో స్పష్టంగా అర్థమవుతోంది. స్కోడా కొడియాక్ ఆర్‌ఎస్ కార్లను కంపెనీ మన దేశానికి కేవలం 50 యూనిట్లను మాత్రమే పరిమితం చేసింది. భవిష్యత్తులో ఈ సంఖ్యను పెంచే అవకాశం ఉందా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. 2.0-లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజన్ ద్వారా పనిచేసే ఈ లేటెస్ట్ మోడల్ 265 హార్స్ పవర్, 400 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 7-స్పీడ్ డ్యూయల్-క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ పొందుతుంది. ఆల్-వీల్-డ్రైవ్ సిస్టమ్ ద్వారా శక్తి నాలుగు చక్రాలకు డెలివరీ అవుతుంది. స్కోడా కొడియాక్ ఆర్‌ఎస్ 6.3 సెకన్లలో 0 నుంచి 100 కిమీ/గం వరకు వేగవంతం అవుతుంది. దీంతో ఇది భారతదేశంలో ఇప్పటివరకు లాంచ్ అయిన అత్యంత వేగవంతమైన స్కోడా మోడల్‌గా నిలిచింది. ఆర్‌ఎస్ వేరియంట్‌లో ప్రోగ్రెసివ్ స్టీరింగ్, 15 అడ్జస్టబుల్ సెట్టింగ్‌లతో కూడిన అడాప్టివ్ డాంపర్‌లు కూడా ఉన్నాయి. ఇవన్నీ మంచి డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుంది. ఇది చూడటానికి స్టాండర్డ్ కొడియాక్ మాదిరిగా కనిపించినప్పటికీ.. కొన్ని అప్‌గ్రేడ్‌లను పొందుతుంది. వీటిలో రీడిజైన్ బంపర్‌లు, ఆర్‌ఎస్ బ్యాడ్జింగ్, 20 ఇంచెస్ అల్లాయ్ వీల్స్, పెద్ద రూఫ్ స్పాయిలర్, డ్యూయల్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఎగ్జాస్ట్ టిప్స్ వంటివి ఉన్నాయి. గ్రిల్, ా=ఎవీలు, విండో ఫ్రేమ్‌లు, రూఫ్ రైల్స్, డీ-పిల్లర్ అంతటా గ్లాస్ బ్లాక్ ఎలిమెంట్స్‌ను ఉపయోగించారు. ఈ ాఖం వెల్వెట్ రెడ్, మ్యాజిక్ బ్లాక్, మూన్ వైట్, స్టీల్ గ్రే అనే నాలుగు కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ఫీచర్స్ విషయానికి వస్తే.. కొడియాక్ ఆర్‌ఎస్ కారులో 12.9-అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఆర్‌ఎస్ స్పెషల్ గ్రాఫిక్స్‌తో కూడిన 10.25-అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో వస్తుంది. పనోరమిక్ సన్‌రూఫ్, త్రీ-జోన్ క్లైమేట్ కంట్రోల్, వెంటిలేషన్, హీటింగ్ అండ్ మసాజ్ ఫంక్షన్‌లతో కూడిన పవర్డ్ ఫ్రంట్ సీట్లు, 13-స్పీకర్ల కాంటన్ సౌండ్ సిస్టమ్ ఉన్నాయి. సేఫ్టీ కోసం, ఈ ాఖంలో తొమ్మిది ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీ కెమెరా, ఏడీఏఎస్ సిస్టం వంటివి ఉన్నాయి. ఇది ఫోక్స్‌వ్యాగన్ టేరాన్ ఆర్-లైన్‌కు పోటీగా ఉంది.

## రివోల్ట్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్.. సింగిల్ ఛార్జ్‌తో 160 km



ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రివోల్ట్ ఆర్‌వీఎక్స్ (Revolt RVX) పేరుతో కొత్త మోటార్ సైకిల్‌ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధరను రూ.1.30 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. పీఎం ఇ-డ్రైవ్ సబ్సిడీ అనంతరం రూ.1.24 లక్షలకు రానుంది. యూత్‌ను ఆకట్టుకునేందుకు పెర్ఫార్మెన్స్‌పై దృష్టిసారించినట్లు కంపెనీ తెలిపింది. రివోల్ట్ ఆర్‌వీఎక్స్‌లో 3.24 ఎజౌష్ట్ర రిమూవబుల్ బ్యాటరీ ఇచ్చారు. సింగిల్ ఛార్జ్‌తో 160 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ చెబుతోంది. ఫాస్ట్ ఛార్జర్‌తో కేవలం 80 నిమిషాల్లోనే 0-80 శాతం బ్యాటరీని ఛార్జ్ చేయొచ్చు. 3.9 సెకన్లలో 0-40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని కంపెనీ క్లెయిమ్ చేస్తోంది. బూస్ట్ మోడ్‌లో గరిష్ఠంగా గంటకు 90 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని కంపెనీ పేర్కొంది. ఆర్‌వీఎక్స్‌లో మొత్తం మూడు రైడింగ్ మోడ్‌లు ఉంటాయి. ఎకో, నార్మల్, స్పోర్ట్ మోడ్ ఆప్షన్లు ఉంటాయి. క్విక్ యాక్సిలరేషన్ కోసం తాత్కాలికంగా బూస్ట్ మోడ్ పనిచేస్తుంది. బూస్ట్‌మోడ్ పరిస్థితులు లేకపోతే ఆటోమేటిక్‌గా స్పోర్ట్‌మోడ్‌కు మారిపోతుంది. ఇందులో వెనుకవైపు మోనోషాక్ సస్పెన్షన్ ఇచ్చారు. ముందూ వెనుక డిస్క్‌బ్రేక్ సదుపాయం ఉంది. 3.5 అంగుళాల ఐపీ67 రేటింగ్‌తో కూడిన డిస్‌ప్లే ఉంది. బ్లూటూత్‌తో స్మార్ట్‌ఫోన్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. జియో ఫెన్సింగ్, కాల్/మెసేజ్ అలర్టులు, హిల్ హోల్డ్ అసిస్ట్, రివర్స్ మోడల్, వాక్ అసిస్ట్ వంటి సదుపాయాలు ఉన్నాయి.

## అమెరికా, ఐరోపా టికెట్ల ధరలు తగ్గాయ్: ఎయిరిండియా




విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర బాగా పెరిగినప్పుడు అంతర్జాతీయ విమాన టికెట్లపై విధించిన ఇంధన సర్‌ఛార్జీని టాటా గ్రూప్ సంస్థ ఎయిరిండియా తాజాగా కొంతమేర తగ్గించింది. ముడిచమురు ధర పశ్చిమాసియా యుద్ధం ముందుస్థాయికి తగ్గడం ఇందుకు కారణం. ఫలితంగా అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) దేశాలకు వెళ్లి, వచ్చే విమానాల్లో టికెట్ల ధరలు కొంతమేర తగ్గుతున్నాయి. అమెరికా-ఆస్ట్రేలియా విమానాల్లో టికెట్‌పై సర్‌ఛార్జీని 280 డాలర్ల నుంచి 200 డాలర్లకు, ఐరోపా-యూకే టికెట్‌పై 205 డాలర్ల నుంచి 125 డాలర్లకు ఎయిరిండియా జులై 1 నుంచే తగ్గించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగింత



**తిరుమల,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, కిష్టారం గ్రామానికి చెందిన నరసింహులు, లడ్డమ్మ దంపతులు తమ కుమార్తె అను షామిని(9)తో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. వారు వెంకటాద్రి నిలయంలో బస చేస్తున్న సమయంలో, శుక్రవారం తెల్లవారుజామున సుమారు రెండు గంటల నుంచి బాలిక కనిపించకుండా పోయింది. సమాచారం అందుకున్న వెంటనే తిరుమల పోలీసులు అప్రమత్తమై, తిరుమల డీఎస్పీ విజయ శేఖర్ పర్యవేక్షణలో కమాండ్ కంట్రోల్ సెంటర్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, బీట్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది సమన్వయంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది అప్రమత్తత, సమన్వయం, వేగవంతమైన స్పందన ఫలితంగా బాలికను సమాచారం అందిన రెండు గంటల్లోపే సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కుమార్తెను క్షేమంగా తిరిగి అప్పగించినందుకు బాలిక తల్లిదండ్రులు తిరుమల పోలీసుల సేవలను అభినందించారు. ఈ సందర్భంగా గాలింపు చర్యల్లో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు, ట్రాఫిక్, కమాండ్ కంట్రోల్ సెంటర్, టీటీడీ విజిలెన్స్ తదితర శాఖల సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు అభినందించారు.

## టీటీడీకి రూ.50.20 లక్షలు విరాళం



**తిరుమల, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తమిళనాడుకు చెందిన కేకేఎస్ కన్స్ట్రక్షన్స్ సంస్థ శుక్రవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.50.20 లక్షలు విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

## ఎస్ఐఆర్‌ను వేగవంతంగా చేపట్టాలి: జేసీ

**అనంతపురం, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఆర్డీవో ఆఫీస్ కార్యాలయం ప్రాంతాల్లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఇందులో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని పోలింగ్ స్టేషన్ నంబర్.274, ఆర్డీవో ఆఫీస్ కార్యాలయం పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్.275 కింద ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, తిరిగి తీసుకోవడాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. బిఎల్ఓ, ఓటర్లతో మాట్లాడారు. ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ఎలా చేస్తున్నారు, ఎలా పూర్తి చేస్తున్నారు, అందరికీ ఫారాలు అందాయా, తదితర వివరాలను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీలోపు ఎస్ఐఆర్ కార్యక్రమంను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ పై ఎలాంటి అలసత్వం ఉండరాదని, ఈ ప్రక్రియను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సూపర్వైజర్లు, బిఎల్ఓలకు మెప్మా పరిధిలోని ఆర్పీలు, సిబ్బంది సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, సూపర్వైజర్, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా లెగిసి వేస్ట్ ప్రాసెసింగ్ ప్రక్రియ

**చిత్తూరు,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక డంపింగ్ యార్డులో జరుగుతున్న వేస్ట్ ప్రాసెసింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ కుమార్ నగరపాలక అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సంతపేటలోని చిత్తూరు నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. వేస్ట్ ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందించారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ పి నరసింహప్రసాద్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, రెవెన్యూ అధికారులతో సంబంధిత అంశాలపై సమీక్షించారు. ప్రధానంగా నగరపాలక సంస్థలో జరుగుతున్న ఎస్.టి.పి, అమృత్ పథకంలో భాగంగా గంగినేని చెరువు పనులు, అడవిపల్లి రిజర్వాయర్ పైప్ లైన్ పనుల పురోగతిపై చర్చించారు. ఇంజనీరింగ్ శాఖ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. సమావేశంలో ఏసీపీలు నాగేంద్ర, సుభప్రధ, గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలి: మంత్రి



**అనంతపురం,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కౌకుంట్ల గ్రామంలో ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో రెండవ రోజు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ నిర్వహించారు. అర్జీదారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఫోన్ ద్వారా అధికారులను మంత్రి ఆదేశించారు. ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రెండో రోజు "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లా, ఉరవకొండ నియోజకవర్గంలోని నలుమూల ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజలు నాయకుల, నుండి అర్జీలను స్వీకరించి అర్జీదారులు సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని ఫోన్ ద్వారా అధికారులను ఆదేశించారు.




# వకుళ మాత ఆలయంలో అక్షరాభ్యాసం

**- అన్నప్రాసన మండపాన్ని సంయుక్తముగా ప్రారంభించిన బిఆర్ నాయుడు, పులివర్తి నాని**






**చంద్రగిరి,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి సమీపంలో వకుళ మాత ఆలయంలో అక్షరాభాస్యం–అన్న ప్రాసన మండపాన్ని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన చైర్మన్‌కి, ఎమ్మెల్యేకి టీటీడీ అధికారులు, ప్రజలు, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వం ఆలోచన విధానం... టీటీడీ సౌజన్యంతో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తల్లి వకుళమాతా దేవి ఆలయంలో అక్షరాభ్యాసం, మండపం నిర్మించడం శుభపరిణామం. కార్యక్రమానికి ఆలయం వద్దకు భారీగా తరలివచ్చిన చిన్న పిల్లల తల్లిదండ్రులు, భక్తులు వకుళామాత ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా.. భక్తిశ్రద్ధల నడుమ సాగిన చిన్నారుల అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలు. చిన్నారులకు స్వయంగా అక్షరాభ్యాసం చేయించి, ఆశీస్సులు అందజేసి... వారికి అక్షర గోవిందం కిట్లను టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యేలు సంయుక్తముగా అందజేసారు. మంగళవారం రోజు తప్ప మిగిలిన రోజులలో వేద పండితులు చెప్పిన సమయంలో కార్యక్రమాలు నిర్వహణ, ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు, చిన్నారులకు అన్నీ రకాల హంగులతో టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ జెబి శ్రీనివాస్, టీటీడీ పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, పనభాక లక్ష్మీ, కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# జూన్ నెలలో రికార్డు స్థాయిలో రూ.1.27 కోట్ల లడ్డూల విక్రయం



**తిరుమల,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానంతరం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వీకరించే శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు ఈ ఏడాది జూన్ నెలలో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో టీటీడీ లడ్డూ ఉత్పత్తిని కూడా విస్తృతంగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా ప్రసాదాలను అందిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 1,11,96,170 లడ్డూలు, మే నెలలో 1,21,35,528 లడ్డూలు, జూన్ నెలలో 1,26,81,805 లడ్డూలు విక్రయమయ్యాయి. గత మూడు నెలలతో పోలిస్తే ఈ జూన్ నెలలో లడ్డూల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. కాగా, 2024 జూన్ నెలలో 1,02,64,364 లడ్డూలు, 2025 జూన్ నెలలో 1,19,21,353 లడ్డూలు విక్రయాలు జరగగా, 2026 జూన్ నెలలో 1,26,81,805 లడ్డూలు విక్రయించడం విశేషం. అంటే గత ఏడాది జూన్‌తో పోలిస్తే 7,59,452 లడ్డూలు అధికంగా విక్రయమవ్వడంతో 6.37 శాతం వృద్ధి నమోదైంది. అలాగే 2024తో పోలిస్తే 24,17,441 లడ్డూలు అధికంగా విక్రయమవ్వగా 23.55 శాతం వృద్ధి నమోదైంది. శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు విచ్చేస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో లడ్డూ ప్రసాదాల తయారీ, పంపిణీలో టీటీడీ సమర్థవంతమైన ప్రణాళికతో వ్యవహరిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం సేవలందిస్తోంది.


# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం చేపట్టాలి**

**- ప్రతిరోజూ ప్రజలకు సురక్షిత తాగునీరు ఇవ్వాలి- కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**

**తిరుపతి,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పు నాణ్యత లోపాలు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు అధికారులు ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల పురోగతి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతిరోజు ప్రజలకు తాగునీరు అందించాలని సూచించారు. డ్రైనేజీ కాలువ లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నగరంలో చెత్త కుప్పలు పేరుకు పోకుండా పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ –2026 ప్రాధాన్యతగా తీసుకొని ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పగడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఇంచార్జి నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి వివిధ విభాగాల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, ఎగ్జామినర్ రామచంద్రారెడ్డి, హెల్త్ ఆఫీసర్ డా. యువఅన్వేష్, డీసీ ఓ దేవికుమారి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువారెడ్డి, డి ఈ లు, సానిటరీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిలకలూరిపేటకు చెందిన చుండి రంగ నాయకులు అనే భక్తుడు శుక్రవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీని అందజేశారు.

# కరకంబాడిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**- ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**



**తిరుపతి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రేణిగుంట మండలం కరకంబాడి గ్రామం, తారకరామ నగరలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ భాను ప్రకాశ్ రెడ్డి తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వే, ఓటర్ల వివరాల ధృవీకరణ, దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ –2026 లో భాగంగా 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్ల జాబితా కి ప్రస్తుత ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను నాణ్యమైన ఓటర్ల జాబితా తయారు చేయడమే లక్ష్యం అని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హత లేని పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మాత్రమే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని, ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నాణ్యతతో సర్వే పూర్తి చేసి ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు బి ఎల్ ఎ లు పాల్గొన్నారు.

# తిరుపతి టిడిపి ఇన్చార్జిగా జేబీ శ్రీనివాస్



**తిరుపతి,జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జిగా దేవి శ్రీనివాసులు నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడదికాలంగా పూరిస్తున్న తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పదవి ఎట్టకేలకు జై బి శ్రీనివాస్ ను వరించింది. తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పదవైన దక్కించుకునేందుకు పదుల సంఖ్యలో టిడిపి నాయకులు పోటీపడ్డారు. అయితే ప్రతిపక్ష నేత భూమన కరుణాకర్ రెడ్డిని తిరుపతిలో దీటుగా ఎదుర్కొనేందుకు యువ రక్తం అవసరం అని గుర్తించిన యువ నేత నారా లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తో గత రెండు రోజులుగా జిల్లా పర్యటనలో ఉన్న సమయంలో సుదీర్ఘంగా చర్చించి ఏ నిర్ణయం తీసుకున్నారు. ప్రతిపక్ష నేతను దీటుగా ఎదుర్కొనేందుకు జేబీ శ్రీనివాస్ నాయకత్వం తిరుపతికి అవసరమని అన్ని వర్గాలు గుర్తించడంతో అధిష్టానం ఆయనకు పట్టం కట్టింది. గత వైసిపి ప్రభుత్వ పాలనలో జేవి శ్రీనివాస్ పార్టీని నిలబెట్టేందుకు విశేషంగా కృషి చేశారు. పార్టీని అన్ని విధాల ఆదుకుంటూ కేసులను కూడా ఎదుర్కొన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి అన్నగాని సత్యప్రసాద్, శాప్ చైర్మన్ రవి నాయుడు, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణ రెడ్డి తదితరుల మద్దతు కూడా జేబీకి ఉండడంతో ప్లస్ అయింది. జేబీకి తిరుపతి నగరంలో వార్డు వార్డుకు తన అభిమానులు యువజన విభాగాలు, పార్టీ సానుభూతిపరులు బలంగా ఉన్నారు. అంతేకాకుండా ఇటు చంద్రగిరి టు శ్రీకాళహస్తి నియోజకవర్గం తన బలమైన వర్గం రేణిగుంట కరకంబాడి తిరుపతి రూరల్ చంద్రగిరి ప్రాంతాల్లో జేబీకి ఉంది. జేబీ ధైర్యవంతుడు ఉత్సాహవంతుడు కావడంతో ప్రతిపక్ష నేతను దీటుగా ఎదుర్కొంటాడని నమ్మకంతో పోటీ దారులు అందర్నీ పక్కనపెట్టి అదృష్టం జై జే బి వరించింది. నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించిన వెంటనే జేబి శ్రీనివాస్ తిరుపతిలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి మబ్బు దేవనారాయణరెడ్డి, పులిహోర మురళి, తిరుపతి నగరం మాజీ అధ్యక్షుడు దంపూరి భాస్కర్ తదితర నాయకులను కలిసి వారిని సత్కరించారు. జేబీని వారు సత్కరిస్తూ అభినందనలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే ఆరణితో టీడీపీ ఇంచార్జ్ జేబి శ్రీనివాస్ భేటీ



**తిరుపతి, జూలై 3 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ను శుక్రవారం సాయంత్రం అసెంబ్లీ నూతన టీడీపీ ఇచార్జ్ జేబీ శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. దుశాలువతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ను జేబీ శ్రీనివాస్ సత్కరించారు. జేబీ శ్రీనివాస్ ను జనసేన జాయినింగ్స్ కమిటీ సభ్యులు ఆరణి మదన్ సత్కరించారు. జనసేన, టీడీపీ నాయకులు పలువురు జేబీ శ్రీనివాస్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాతయ్యగుంట గంగమ్మ గుడి ఆలయ చైర్మన్ మైనర్ మహేష్ యాదవ్ టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027